J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్


సంపుటి : 44 సంచిక : 29 20.12.2024, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి






## నాడు 2020.. నేడు 2047

# మహాయజ్ఞం ఫలిస్తే.. మరోచరిత్రే




- సుదీర్ఘ లక్ష్యంతో ఏపీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు
- విజన్ డాక్యుమెంట్ 2047తో సరికొత్తగా ముందుకు
- ప్రభుత్వాలు మారినా లక్ష్యం గురితప్పకుండా పునాదులు
- 23 ఏళ్ళ ప్రణాళికతో 10 సూత్రాల అమలుకు అజెండా
- కార్యాచరణ లోపిస్తే.. అప్పల ఆంధ్రప్రదేశ్‌కు విజన్ డాక్యుమెంట్ ఓ గుదిబండే
- గత పాలనలో లోకేష్‌ను ఫోకస్ చేసే క్రమంలో తీవ్ర విమర్శలు
- ఈసారీ ఆ తప్పు జరగకుండా జాగ్రత్త పడతారా?

*నవ్యాంధ్ర తొలి అంచె పాలనలో దశా-దిశ లేని రాష్ట్రానికి చుక్కానిగా.. తీరు-తెన్ను లేని యంత్రాంగానికి దివిటీగా.. గమ్యం-గమనం తెలియని తెలుగు జాతికి ఆశాకిరణంగా.. ఆంధ్రాని పాలించిన నారా చంద్రుడు.. రెండో అంచెలో సరికొత్త లక్ష్యాలు.. మహా.. ఆశయాలతో ముందుకు సాగేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజన్ 2020తో ప్రపంచ తెలుగు యవనికపై చెరగని ముద్ర వేసిన బాబు.. తాజాగా విభజిత ఆంధ్రప్రదేశ్‌లో విజెన్ డాక్యుమెంట్-2047తో శతకోటి ఆశలకు.. అనంతకోటి ఆలోచనలకు ఊపిరులూదారు.*

*ఉమ్మడి రాష్ట్రంలో 2004లో చంద్రబాబు తర్వాత బాధ్యత తీసుకున్న వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. అభివృద్ధిలో అదే ఒరవడిని కొనసాగించింది. ఫలితంగా ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంతో పాటు ప్రపంచంలోని అత్యుత్తమ ఐటీ కంపెనీలన్నీ రావడానికి విజన్-2020 దోహదపడింది. అయితే, కాలక్రమంలో రాజకీయ, ఆర్థిక అంశాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విచ్ఛిన్నం చేశాయి. ఆంధ్రుల కలలకు రెక్కలు తొడిగిందనుకున్న హైదరాబాద్ ఆంధ్రులకు దక్కకుండానే పోయింది. చివరికి నేడు అతుకుల రోడ్డుపై గతకుల ప్రయాణం సాగిస్తున్న కొత్త రాష్ట్రానికి.. అకుంఠిత దీక్ష.. అసమాన పట్టుదలతో అభివృద్ధి మంత్రాన్ని జపిస్తూ స్వర్ణాంధ్ర సాకారానికి బాబు బయలుదేరారు. ఈ ఆశయం సిద్ధిస్తే.. ఆంధ్రుల భవిష్యత్ పూలపాన్పే..! కానీ రాజకీయ వైకుంఠపాళిలో లక్ష్యం గురితప్పితే.. దశాబ్దాల కల మరుగునపడితే.. డైవర్షన్ పాలిటిక్స్‌లో ఈ విజన్ డాక్యుమెంట్ కూడా ఓ భాగమైతే.. ప్రచారమే పరమావధిగా.. పుత్రప్రకాశమే అసలు ఎజెండా అయితే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మేడిపండు చందమే.!*

మీరు.. అతికష్టంతో సత్వర ఫలితం ఆశిస్తే.. ఆహార పంటలు!

స్వల్ప కష్టంతో దీర్ఘఫలితం ఆశిస్తే.. తోట పంటలు!

"జ్ఞానంతో కూడిన తరతరాల భవిష్యత్‌ను ఆశిస్తే.. సుశిక్షిత మానవ వనరులను పెంపొందించుకోండి" అన్న మహాత్ముడి సూక్తితో.. భగీరథ ప్రయత్నానికి.. చంద్రబాబు శ్రీకారం చుట్టారు. వందేళ్ళ భారతంతో తెలుగోడి ఘనకీర్తి కోసం.. 'శతమానంభవతి' అంటూ ఆంధ్రుల ప్రగతికి ఇరవై మూడేళ్ళ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఇదే ఏపీ విజన్ డాక్యుమెంట్-2047. పది అంశాలతో కూడిన ఈ ప్రణాళికలో ఎన్నో ఆలోచనలు.. మరెన్నో ఆవిష్కరణలు.

## అభివృద్ధి 'దశ'దిశలా..


సంపద సృష్టికర్త, టెక్నాలజీ గురువు.. విజనరీ.. దీర్ఘదర్శి.. చంద్రబాబుకు పర్యాయ పదాలు. అభివృద్ధిని ముందే ఊహించడం, సంక్షేమంలో సాంకేతికను జోడించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

10లో





పాఠకులకు, ప్రకటనకర్తలకు,
చందాదారులకు, మిత్రులకు, క్రైస్తవ సోదరులకు
క్రిస్మస్ శుభాకాంక్షలు
సం/-



## వైకాపా పాలనలో..
# అన్నదాతలకు తీరని ద్రోహం



ధ్వజమెత్తిన సోమిరెడ్డి

అయిదేళ్ళ వైకాపా పాలనలో నాటి ముఖ్యమంత్రి జగన్ అన్నదాతలను అధోగతి పాల్జేశాడని, జగన్‌కు రైతుల పేరెత్తే అర్హత కూడా లేదని మాజీమంత్రి, టీడీపీ నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజ మెత్తారు. ఇటీవాల మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో జగన్ పాలన తీరును దుయ్యబట్టారు. అస్తవ్యస్థ నిర్ణయాలతో రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని జాతీయస్థాయిలో మూడోస్థానానికి తీసుకువెళ్ళారని, కౌలురైతుల ఆత్మహత్యల్లోనూ తమిళనాడు తర్వాత మన రాష్ట్రమే అగ్ర స్థానంలో నిలిచిందని, వైకాపా హయాంలో జగన్‌రెడ్డి సాధించిన ఘనత ఇదేనని ఆయన తూర్పారబట్టారు. అన్నదాతల ప్రయోజ నాలతో ముడిపడిన కీలకమైన వ్యవసాయ శాఖను మూసేశారని, ఇరిగేషన్ శాఖను లేవకుండా చేశారని, జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కసారి పులివెందులకు వెళ్లి రైతులతో మాట్లాడితే వ్యవసాయ రంగానికి జగన్ చేసిన ద్రోహం ఎలాంటిదో తెలుస్తుందని విమర్శించారు. మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ యాంత్రీకరణ, భూసార పరీక్షలు, సూక్ష్మ పోషకాల పంపిణీ తదితర పథకాల అమలులో వైకాపా వెనుకబడిపోయిందన్నారు. ఇప్పుడు తమ ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోందని, అదే వైసీపీ ప్రభుత్వంలో రైతు లకు ఐదారు నెలలు పడిగాపులు తప్పలేదని గుర్తుచేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పరంగా సాధించిన ఘనత ఏమైనా ఉందా? అసలు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏనాడైనా రైతుల మధ్యలోకి వచ్చారా.. వ్యవసాయం గురించి సమీక్ష చేశారా?.. అని ఆయన ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'విజన్-2047' ప్రణాళికలో రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. తమకు, జగన్ ప్రభుత్వానికి అదే తేడా అని ఆయన వివరించారు.

## సోమిరెడ్డితో.. నీటి సంఘాల ప్రతినిధుల భేటీ



సర్వేపల్లి నియోజకవర్గంలో ఇటీవల సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్య క్షులు, డైరెక్టర్లుగా ఎన్నికైన వారికి శుభా కాంక్షలు తెలియజేశారు మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి. రైతులకు సేవ చేసే అవ కాశం కల్పించినందుకు సోమిరెడ్డికి ధన్య వాదాలు తెలియజేసిన సాగునీటి సంఘాల ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రైతులకు అందుబాటులో ఉండి సాగునీటి యాజమాన్యాన్ని సమర్థ వంతంగా నిర్వహించాలన్నారు.

### అమరజీవికి నివాళి

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా డిసెంబరు 15న నెల్లూరులోని శ్రీ పొట్టి శ్రీరాములు బస్టాండ్ సెంటరులోని ఆయన విగ్రహానికి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

## ఆదిశంకర ధ్యానమందిరంలో.. దత్త జయంతి


- చతుర్వేద పండితులకు సత్కారాలు



ఈనెల 14న దత్త జయంతి సందర్భంగా నెల్లూరులోని ఆదిశంకర ధ్యానమందిరంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చతుర్వేద పండితులను నగదు బహుమతులు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ధ్యానమందిరం మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ కపిలవాయి అచ్యుత రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేదపండితులు బ్రహ్మశ్రీ ముక్కామల వశిష్ఠ శర్మ(ఋగ్వేదం), బ్రహ్మశ్రీవిరుపావఝుల పవన్‌కుమార్‌చైతన్యశర్మ (యజుర్వేదం), బ్రహ్మశ్రీ కొత్తలంక సుబ్రహ్మణ్య శర్మ(సామవేదం), బ్రహ్మశ్రీ తుర్లపాటి పవన్‌కుమార్‌శర్మ(అధర్వణ వేదం)లకు దాతల సౌజన్యంతో ఈ సత్కారాలను నిర్వహించారు. స్వామి సమయానందనాథతో పాటు, ఈ కార్యక్రమానికి ప్రధాన సంధానకర్త మైపాడు రాజాశర్మను, సత్కారసంబారాలు అందించిన ఉపాధ్యాయులను చక్రాల ఆనందకుమార్, విశిష్ట అతిథి బ్రహ్మశ్రీ కపిలవాయి అచ్యుతరామారావు అభినందించారు. ఇదంతా కంచి కామకోటి పీఠాధిపతి పరమాచార్య.. పూజ్యశ్రీ చంద్ర శేఖరేంద్రస్వామివారి కృపాకటాక్షమేనని వారు వినమ్రంగా చెప్పారు. ఆ తర్వాత, శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య బ్రహ్మీలీన శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామివారు 54 శ్లోకాలతో రచించిన శ్రీ గురు చరిత్ర, దత్తాత్రేయ స్తోత్రం పారాయణాలు జరిగాయి. గాజులపల్లి శివరామయ్య వేదాధ్యయనం గావించారు. అనంతరం, వేదపండితులు నాలుగు వేదాల అనువాకాలతో అందరికీ శుభాశీస్సులు అందజేశారు.

## గొలగమూడిలో.. 24 నుంచి
# అఖిలాంధ్ర భక్త సమ్మేళనం

మూడురోజులపాటు భజనలు, సత్సంగాలు



జిల్లాలో ప్రసిద్ధ దేవాలయం.. వెంకటాచలం మండలం గొలగమూడిలోని అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి సన్నిధి ప్రాంతంలో డిసెంబరు 24, 25, 26తేదీల్లో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి 13వ అఖిలాంధ్ర భక్తసమ్మేళనం-సత్సంగం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. విజయవాడలోని సింగ్‌నగర్‌లో ఉన్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి అభయ మందిరం వారి నేతృత్వంలో, స్వామివారి తత్వ ప్రచారకులు వైవి రాజుస్వామి ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మేళనంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకుచెందిన వెంకయ్య స్వామి భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొంటారని, ఈ మూడురోజులు స్వామివారి నామసంకీర్తనలు, భజనలు, సత్సంగ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 24వ తేదీ ఉదయం 9.30 గంటలకు జరుగనున్న జ్యోతిప్రజ్వలన కార్యక్రమం-సత్సంగం ప్రారంభోత్సవంలో గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ ఇఓ పి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొంటారని, ఈ కార్యక్రమాల పర్యవేక్షకులు మండవ రవికాంత్ తెలియజేశారు. ప్రతిరోజూ ఉదయం6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారి భజనలు, నామస్మరణలు నిర్వహిస్తామని, ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగే ఈ కార్యక్రమాల్లో భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అమరజీవి త్యాగం మరువలేనిది

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం చేసిన త్యాగం మరువలేనిదని నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్ అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా ఈనెల 15న వివిఎస్‌యులో జరిగిన కార్యక్రమంలో ఆయన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల హక్కుల సాధన కోసం ఆయన ప్రాణత్యాగం చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని, ఈ తరం యువత ఆయన త్యాగం నుంచి స్ఫూర్తి పొందాలని ఆయన చెప్పారు. విశ్వ విద్యాలయ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ కోట నీలమణికంఠ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో..
# రాష్ట్రంలో సుపరిపాలన

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలం అలగాయపాలెంలో ఇటీవల శ్రీఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని భావించడం సంతోషకరమని, దాదాపు 11అడుగుల రాతి విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయనున్నారని, ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు. కరేడు పంచాయతీకి రావాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నామని, ప్రస్తుతం దైవ కార్యక్రమం సందర్భంగా ఇక్కడికి రావడం శుభపరిణామన్నారు. కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు రాళ్లపాడు డ్యాం గేటు మరమ్మతులను దగ్గరుండి పర్యవేక్షించడం, రైతులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. గత ఎన్నికల్లో కరేడు పంచాయతీ తమ పార్టీకి మంచి మద్దతునిచ్చిందన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ఉండటం జిల్లాకు అదృష్టమన్నారు. కేంద్ర మంత్రులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక సమస్యలకు వేమిరెడ్డి పరిష్కారం చూపుతుండడం హర్షదాయకమన్నారు. తొలుత ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎంపీని, ఎమ్మెల్యేని స్వాగతించారు.

# అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి



- చెక్కులను పంపిణీచేసిన ప్రశాంతమ్మ


కోవూరు నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్య బాధితులకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను నెల్లూరు మాగుంట లేఅవుట్ లోని తమ నివాసంలో పంపిణీ చేశారు. బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన చంద్రగిరి దేవరాజుకు రూ.66,651, ఇందుకూరుపేట గ్రామానికి చెందిన కాకాణి నీరజకు రూ.35 వేలు, కోవూరుకు చెందిన పాకం సుజాతకు రూ.85,044, కొడవలూరు నివాసి మారంరెడ్డి కౌసల్యమ్మకు రూ.2 లక్షలా 2వేలా 483 రూపాయలు.. మొత్తం 3 లక్షల 88 వేల 578 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆమె అందజేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, కోవూరు నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటి వరకు 28 లక్షల 94 వేల 245 రూపాయల చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల వ్యవధిలో తమ నియోజకవర్గంలోని అనారోగ్య పీడితులకు 4సార్లు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం అందచేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడికే దక్కుతుందని, ఆ నిరుపేదల ఆశీస్సులే ఆయనకు శ్రీరామరక్ష అని ఆమె అన్నారు.

# పోతన భాగవతం..సకల జనరంజకం!

మహాకవి పోతన భాగవత రచన సకల జనరంజకమని, భాగవతం భక్తిమార్గం బోధిస్తుందని తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ చెప్పారు. స్థానిక 'చేతన' సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు టౌన్‌హాల్ ఆవరణలోని వర్ధమాన సమాజం హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'పోతన భాగవత కవితా వైభవం' అనే అంశంపై ఉపన్యసించారు. భాగవతం రమణీయ, కమనీయ కవితా శిల్పం అని ఆయన అభివర్ణించారు. అనంతరం, పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్ర ప్రసాద్, కవయిత్రి గోవిందరాజుల సుభద్రాదేవి, చేతన కార్యదర్శి శేషగిరీశం తదితరులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం సభను నిర్వహించారు. బాలసాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్, కవి బొగ్గరపు రాధా కృష్ణమూర్తి, ఆర్.నారాయణస్వామి, వై.విశ్వనాథం, మురళీకృష్ణ, సుబ్బారాయుడు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

# మా జిల్లాలో రోడ్లు బాగుచేయండి

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరిన విపిఆర్



నెల్లూరు జిల్లాలో రహదారుల అభివృద్ధి కోసం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అలుపెరుగని కృషి చేస్తున్నారు. ఢిల్లీలో రోడ్లమంత్రి నితిన్‌గడ్కరీని ఇటీవల ఆయన కలసి, జిల్లాలో రోడ్ల దుస్థితిని వివరించారు. రోడ్లకు సంబంధించిన పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రాలు కూడా ఇచ్చారు. కావలి పట్టణంలో ట్రాఫిక్ నానాటికీ పెరిగిపోతోందని, ఆ సమస్య పరిష్కారానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని విపిఆర్ కోరారు. దుత్తలూరు– కావలి రోడ్డు పనుల్లో వేగం పెరిగేలా అధికారులను ఆదేశించాలని, రాజుపాలెం నుంచి రామాయ పట్నం పోర్టు వరకు రహదారిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తిచేశారు. రామాయపట్నం పోర్టుకు రహదారిని విస్తరించాలని సూచించారు. రాజుపాలెం నుంచి అల్లూరు మీదుగా రామాయపట్నం ఓడరేవు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మీదుగా జాతీయ రహదారి వరకు ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్డును రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించారు. ఈ రహదారి ఏర్పాటైతే రామాయపట్నం ఓడరేవు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి జాతీయరహదారి–16కి లాజిస్టిక్ ఎగుమతులు సులభతరం అవుతాయని వివరించారు. అదేవిధంగా, జిల్లా తీరప్రాంత గ్రామాలలో నివసించే మత్స్యకారులకు రవాణా సౌకర్యం మెరుగుపడి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రమంతి నెల్లూరుజిల్లాలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని విపిఆర్‌కి హామీ ఇచ్చారు.

## వేమిరెడ్డితో..ఐఎఫ్‌ఎస్ అధికారులు

ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికైన తెలుగు అధికారులు ఇటీవల ఢిల్లీలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గౌరవపూర్వకంగా కలిశారు. పార్లమెంట్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొంటున్నారు. ఆ శిక్షణలో భాగంగా ఎంపీ వేమిరెడ్డిని కలిసిన ఐఎఫ్‌ఎస్ అధికారులు ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌కు సంబంధించి విధివిధానాలు, క్రమశిక్షణ, ఇతర అంశాలపై వేమిరెడ్డి వారికి దిశానిర్దేశం చేశారు.

# ‘శ్రీసిటీ’ పరిశ్రమల ఔదార్యం

- విపత్తుల సహాయనిధికి కోటి విరాళం




అంతర్జాతీయ పారిశ్రామికవాడగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీసిటీ, ఆ ప్రాంగణంలోని పరిశ్రమలు తమ సామాజిక సేవను చాటుకుంటున్నాయి. ఈనెల 19న జిల్లా విపత్తుల సహాయనిధికి శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత(సిఎస్ఆర్)లో భాగంగా, కోటి రూపాయల విరాళాన్ని ఇవ్వడం ఆ పరిశ్రమల నిబద్ధతకు నిదర్శనం. ప్రభుత్వ పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమక్షంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆ విరాళం చెక్కును తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ.. దాని పరిశ్రమల భాగస్వామ్య సమిష్టి కృషిని డాక్టర్ యువరాజ్ ప్రశంసించారు. బాధిత కుటుంబాలకు తన సంఘీభావాన్ని తెలియజేసిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, విపత్తు సహాయ కార్యక్రమాలకు చేయూతనివ్వడంలో శ్రీసిటీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ‘అవసర సమయాల్లో శ్రీసిటీ కమ్యూనిటీ ప్రజలకు అండగా నిలుస్తుందని’ ఆయన స్పష్టం చేశారు.

## అంబులెన్స్ విరాళం..

శ్రీసిటీ పరిశ్రమల సీఎస్ఆర్ చొరవలో భాగంగా, శ్రీసిటీలోని లీనియర్ మోషన్ గైడ్‌లను ఉత్పత్తిచేసే ప్రముఖ జపనీస్ పరిశ్రమ టీహెచ్‌కె ఇండియా వారు రూ.29లక్షల విలువైన అంబులెన్స్‌ను శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీకి విరాళంగా ఇచ్చారు. దీనిని పరిశ్రమల శాఖ కార్యదర్శి ద్వారా ఆ అథారిటీవారికి అందజేశారు.

### సాగునీటి సంఘాల నాయకులకు..

# ‘జనసేన’ సన్మానాలు



కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఇటీవల నిర్వహించిన సాగు నీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించినవారికి నెల్లూరులోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో ఈనెల 18న ఘనంగా సన్మానాలు చేశారు. ఏపీ టిడ్కో ఛైర్మెన్ వేములపాటి అజయ్ సూచనలతో జనసేన నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని, కొత్తగా ఎన్నికైన సాగునీటి సంఘాల నాయకులకు అభినందనలు తెలియజేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు సాగునీరు, త్రాగునీరు అందించ డంలో నీటి సంఘాల పాత్ర కీలకమని, నీటి వనరుల సంరక్షణ, అభివృద్ధి కోసం గెలిచిన సభ్యులు తమ పదవులను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని నాయకులు చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలుస్తుం దని హామీ ఇచ్చారు. గెలిచినవారందరికీ జనసేన పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, కాకు మురళి, శ్రీనివాసులురెడ్డి, శ్రీను, సురేష్, భవానినాయుడు, వెంకటరమణమ్మ, నందిని, కస్తూరి, వీర మహిళలు పాల్గొన్నారు.

# రేబాల శ్రీలక్ష్మికి.. సూర్యకాంతం అవార్డు



తన సహజనటనతో ప్రేక్షకలోకాన్ని ఉర్రూతలూగించిన మహానటి సూర్యకాంతం శతజయంతి వేడుకలు ఈనెల 17న నెల్లూరులోని వర్ధమాన సమాజం హాలులో ఘనంగా జరిగాయి. స్థానిక చేతన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విశిష్ట అతిథిగా పాల్గొన్న ‘సినీవిజ్ఞాన విశారద’ ఎస్‌వి రామారావు (హైదరాబాద్) మాట్లాడుతూ, సూర్యకాంతం నటనా విశేషాలను వివరించారు. సూర్యకాంతం తెలుగువారంతా గర్వించే అరుదైన నటీమణి అని, ఆమె నటన అద్వితీయమని, ఏ పాత్ర ధరించినా ఆ పాత్రకు ఆమె జీవం పోస్తుందని అన్నారు. సినిమాల్లో గయ్యాళిపాత్రలు పోషించినా, నిజజీవితంలో ఆమె ఎంతో సహృదయురాలని తెలిపారు. ఈ సందర్భంగా మహానటి సూర్యకాంతం శతజయంతి పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటీమణి రేబాల శ్రీలక్ష్మికి బహుకరించారు. సినీ రచయిత డా.పి.రాజేంద్రకుమార్, జమలాపురం రాధాకృష్ణ, పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, చేతన కార్యదర్శి శేషగిరీశం, విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం, నెరసం అధ్యక్షుడు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


## శ్రద్ధాంజలి



జననం
05.09.1943

నిర్యాణం
11.12.2024

మా ఇంటి దేవత, నా సతీమణి

**శ్రీమతి వి.రాజకుమారి**

(W/o చిత్రాల విశ్వేశ్వరరాజు)

డిసెంబర్ 11వ తేదీ, బుధవారం స్వర్గస్తురాలైనారు.

**శుభస్వీకరణం**

డిసెంబర్ 21వ తేదీ, శనివారం మధ్యాహ్నం 12 గంటలకు
సాయి నివాసం, 4/6, 27వ వీధి, 7వ అవెన్యూ, అశోక్‌నగర్,
వైఎంసిఏ టేబుల్ టెన్నిస్ అకాడమీ ఎదురుగా,
చెన్నై - 600 083 నందు జరుగును.

సి.వి.రాజు
మరియు కుటుంబసభ్యులు
09407 38769 / 93609 35858

వెన్యూ కొరకు
స్కాన్ చేయండి

లాయర్
డిసెంబర్ 20, 2024

# పోషకాహార లోపం.. బాలల భవితకు శాపం!

దేశంలో తిండిగింజలకు కరువు లేకున్నా, సరైన పోషకాహారం లేదా సమతులాహారం లేకపోవడంతో బాలల భవిత అంధకారంలో పడిపోతోంది. ప్రజలకు ఆహార భద్రతతో పాటు ఆరోగ్య భద్రత కూడా ఎంతో అవసరమన్నది అందరికీ తెలిసిందే. ముఖ్యంగా కోట్లాదిమంది పసిబిడ్డలకి, చిన్నారులకి చిన్నవయసు నుంచే మంచి ఆహారం లేకపోతే వారి ఆరోగ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుంది. సరైనపాళ్ళలో సమతుల ఆహారం అందించకపోతే వ్యాధినిరోధక శక్తి క్షీణించి రకరకాల వ్యాధులకు గురయ్యే ప్రమాదం కూడా ఎంతైనా ఉంది. ఎదిగే బిడ్డలకు సరైన పోషకాహారమే శ్రీరామరక్ష!. అయితే, దురదృష్టవశాత్తూ మనదేశంలో కోట్లాదిమంది బాలలకు నేటికీ సరైన పౌష్టికాహారం అందడం లేదని నిపుణుల అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. చురుకుదనం, జ్ఞాపకశక్తి, మానసిక స్థితి బాగుండడం, వ్యాధుల బాధలకు దూరంగా ఉంటూ శారీరకంగా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకపోవడం వంటివన్నీ బాలలకు పుష్టికరమైన సమతులాహారం వల్లనే లభిస్తాయి. ఎలాంటి ఆహారం పెడితే పిల్లల ఎదుగుదల బాగుంటుందో, ఎలాంటి ఆహారం అనారోగ్యకరమైనదో తెలియ చెప్పడానికి అటు వైద్యుల నుంచి ఇటు ప్రభుత్వాలు, ప్రచార ప్రసారమాధ్యమాలు నిత్యం బోలెడన్ని సూచనలు చేస్తూనే ఉన్నాయి. కానీ, ఆచరణలోకి వచ్చేసరికి అవన్నీ చతికిలబడి పోతున్నాయి. దేశంలో 70శాతం మంది ప్రజలకు ఆరోగ్య వంతమైన ఆహారం అందడం లేదని, వారిలో 15 శాతం మంది పోషకాహారం లేక రోగాల బారిన పడుతున్నారని, 77శాతం మంది చిన్నారులు కనీస సమతులాహారం లేక అవస్థలు పడుతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయంటే, పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఊహించుకోవచ్చు. పౌష్టికాహారం లేక బక్కచిక్కిపోతున్న బాలలు భారత్‌లో గణనీయంగా ఉన్నారని, అయిదేళ్లలోపు పిల్లల్లో కనీసం 30 శాతం మంది వయసుకు తగ్గట్టుగా ఎదగడం లేదని అంతర్జాతీయ ఆరోగ్యసంస్థలు సైతం చెప్తున్నాయి. ఆరోగ్యం సరిగ్గా లేక బడులకు వెళ్ళలేని బాలలు కూడా పెద్దసంఖ్యలోనే ఉంటున్నారని గణాంకాలు చెప్తున్నాయి. వాస్తవానికి తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం, మాతాశిశు సంరక్షణ కోసం దేశంలో ఎంతో కాలం నుంచి ఎన్నోరకాల పథకాలు అమలులో ఉన్నా, నేటికీ పోషకాహార లోపం బాలల ఆరోగ్యానికి, వారి భవితకు ఒక పెద్ద శాపంలా పరిణమించి ఉండడం బాధాకరం. ఈ నేపథ్యంలో పిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వాలో సూచిస్తూ, 'మినిమం డైటరీ డైవర్శిటీ (ఎండీడీ) పేరుతో ప్రపంచ ఆరోగ్యసంస్థ శిశువులకు, బాలలకు, వయసు వారీగా పలు పదార్ధాలతో కూడిన సమ్మిళిత ఆహారం పెట్టాలని మార్గదర్శకాలు కూడా చేసింది. అయితే, అలాంటి సమతుల ఆహారం కూడా మనదేశంలో 77శాతం పిల్లలకు అందడం లేదని కూడా తేలింది. ఆరోగ్యం పట్ల, ఆహారం పట్ల తల్లులకు సరైన అవగాహన లేకపోవడం అందుకు ప్రధాన కారణాలుగా విశ్లేషించింది. ఐసీడీఎస్, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, దేశం మొత్తం మీద చూస్తే పోషకాహార లోపంతో పిల్లలకు రక్తహీనత, బరువు తక్కువగా పుట్టడం వంటి సమస్యలు విపరీతంగా వస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఆకలికి ఏదో పెట్టేద్దామనే భావనలు పోయి, తాము కానీ, తమ పిల్లలు కానీ ఆరోగ్య వంతంగా, దృఢంగా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తల్లులు మనసుకు తెచ్చుకోవాలి. ఆ విషయాల పట్ల ప్రభుత్వాలు, స్వచ్ఛంధసంస్థలు ప్రజలకు మరింతగా అవగాహన కల్పించడం అవసరం. అంతేకాదు, పేదవర్గాల వారికి, సామాన్య కుటుంబాల్లో ఉన్న బిడ్డలకు క్రమపద్ధతిలో సమతులాహారం అందించేందుకు కూడా పాలకులు ప్రణాళికలు సిద్ధం చేయాలి. తద్వారా, బాలల సంక్షేమం అన్నది ప్రభుత్వాలకి ఒక నిరంతర ప్రక్రియ కావాలి. పిల్లలు అనారోగ్యంతో కదల్లేక మెదల్లేక బాధపడుతుంటేనో, నిస్సత్తువగా నిరాశగా నీరసంగా ఉంటేనో ఆయా తల్లితండ్రులకే కాదు, మొత్తంగా సమాజానికే క్షేమం కాదు. ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశపురోభివృద్ధి సాధ్యమవుతుందని గమనించాలి. ఆరోగ్యవంతులైన బాలలే రేపటి భారతావని ప్రగతికి నిర్దేశకులవుతారని గ్రహించాలి. ఇకనైనా పెద్దలంతా పెద్ద మనసుతో పిల్లల ఎదుగుదలకు చేయూతనందించాలి. పాలకులు దీనినొక బాధ్యతగానే కాక, పవిత్ర కార్యంగా భావించి, బాల భారతాన్ని ఆరోగ్యవంతంగా రూపుదిద్దేందుకు సమాయత్తం కావాలి. స్వచ్ఛంధ సంస్థలు, తల్లితండ్రులు, మేధావులు కలసికట్టుగా అందుకు నడుం బిగించాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది. 'ఆరోగ్యభారత్' కూడా సాకారం కావడానికి మార్గం సుగమం అవుతుంది.

# పీక్స్‌కి చేరిన సినిమావాళ్ళ పబ్లిసిటీ పిచ్చి!

తెరవెనుక జరిగే సంఘటనలని కూడా గోరంతని కొండంతగా చూపించుకుని మన సినిమావాళ్ళు తమ ప్రచారానికి ఎలా వాడుకుంటారో కొన్ని తాజా సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ఇద్దరు ప్రముఖుల కుటుంబాలలో ఇటీవల జరిగిన రెండు సంఘటనలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కుటుంబంలో చెలరేగిన ఆస్తి తగాదాని బహిర్గతం చేసుకుని మోహన్‌బాబు కుటుంబం రచ్చకెక్కింది. అదే సమయంలో మీడియాపై విచక్షణా రహితంగా దాడి చేసిన మోహన్‌బాబు తన సహజ గుణాన్ని బయటపెట్టుకున్నాడు. స్వతహాగా కోపిష్టిగా పేరున్న మోహన్‌బాబు మీడియా కెమెరాలు కనిపించగానే ఉగ్రుడై నిజజీవితంలో కూడా సినిమా తరహాలో రెచ్చిపోయి వారి మైకుతోనే వారిపై దాడి చేసి సార్ధక నామధేయుడనిపించుకున్నాడు. ఇక సంధ్య థియేటర్ సంఘటనలో మహిళ మృతికి పరోక్షంగా కారణమైన పుష్ప-2 సినిమా హీరో అల్లు అర్జున్ అరెస్టు సంఘటనని కూడా సినీ ప్రముఖులు తమకి అనుకూలంగా మార్చుకోవడం విచిత్రంగా, వికారంగా ఉంది. అర్జున్ జైలు నుండి బెయిలుపై రాగానే తండోపతండాలుగా సినీ ప్రముఖులంతా అల్లు ఇంటికి క్యూ కట్టడం, ఆయనకి సంఘీభావం ప్రకటించి ఓదార్చడం అతిగా అనిపించింది. అల్లు అర్జున్ ఉద్యమాలు చేసి జైలుకి వెళ్ళలేదు. ఒక మహిళ మృతికి బాధ్యుడిగా అరెస్టు అయ్యాడు. అలాంటి సందర్భంలో ఏదో జరిగిపోయినట్లుగా సినీ దిగ్గజాలంతా ఓదార్పు యాత్ర చేయడం, ఆ సంఘటనలని మీడియా వాళ్ళు లైవ్‌లో చూపించడం కొంచం అతిగా అనిపించింది. తమ నిజజీవితంలో జరిగే సంఘటనలని సైతం సినిమావాళ్ళు ఏ విధంగా ప్రచారానికి వాడుకుంటారో చెప్పడానికి ఈ రెండు సంఘటనలే ఉదాహరణ.

బి.హిమబిందు - గుంటూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# విజయసాయిరెడ్డికి రాజకీయాలు అవసరమా?

జగన్‌మోహన్‌రెడ్డి కేసులలో ఏ-2గా వున్న విజయసాయిరెడ్డికి రాజకీయాలు ఎందుకు..? ఆయన వృత్తి లెక్కలు చూడడం, ప్రవృత్తి వ్యాపారం. మరి అలాంటి వ్యక్తి రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఏముంది? తొలిసారి రాజ్యసభ సభ్యుడైనప్పటి నుండి కానీ, ఆ తరువాత వైసీపీ అధికారంలోవున్న అయిదేళ్ళు కానీ సాయిరెడ్డి ఒక్కరికైనా సహాయం చేసిన పాపాన పోలేదు. పైగా పదవులు అలంకరించిన తరువాత తనకి బాగా దగ్గరైనవాళ్ళు, ఎన్నికల తరుణంలో తనకి అండగా నిలచినవాళ్ళు, చివరికి తన చిరకాల మిత్రులు ఫోన్ చేసినా సాయిరెడ్డి ఎత్తుకొనేవాడు కాదన్న గొప్ప పేరు కూడా ఆయనకి ఉంది. ఇప్పుడు కొత్తగా తాము అధికారంలో వున్నప్పుడు వైసీపీ శ్రేణుల్ని, కార్యకర్తలని పూర్తిగా విస్మరించామని, నిర్లక్ష్యం చేశామని పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వాళ్ళని అసలు పట్టించుకోలేదని ఆయనే చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. ప్రజలు ఆయనని, ఆయన నాయకుడిని, ఆయన పార్టీని ఓడించి మూలన కుర్చోపెడితే తప్ప సాయిరెడ్డికి కనువిప్పు కలగలేదేమో. ఇప్పుడు మళ్ళీ పార్టీ శ్రేణులని తల్చుకోవడానికి సిగ్గనిపించడం లేదేమో. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం సాయిరెడ్డీ. మళ్ళీ ఎన్నికలకి ఇంకా నాలుగున్నర సంవత్సరాల గడువుంది. ఆలోగా ఎన్ని అవాంతరాలు వచ్చి పడతాయో, మీ భాగోతాలు ఎన్ని బయటపడతాయో వేచి చూడండి. అయినా ప్రజాక్షేత్రంలో గుర్తింపులేని నీకెందుకయ్యా రాజకీయాలు!

- పి.వీ.ఎన్.రెడ్డి, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, నెల్లూరు.




# కలిమి లేములు.. కష్ట సుఖాలు!

"కలిమిలేములు.. కష్ట సుఖాలు" అని ఓ మహాకవి ఎప్పుడో 'దేవదాసు' సినిమాలో ఓ పాట రాశాడు. అదే అక్షర సాక్ష్యంగా నేటి ఆధునిక సమాజంలో కోట్లాది కుటుంబాలు నిరాశా నిస్పృహల్లో అలమటిస్తున్నాయి. తమ ఈతిబాధలు ఎవరికీ చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతున్నాయి. కుటుంబాలలో మనుషుల మధ్య మాటా మంతి లేదు. ఆలూమగల మధ్య ముద్దుముచ్చటా లేదు. ఓ సంబరం లేదు, సంతోషం అంతకన్నా లేదు. ఎన్నాళ్ళీ ఏడుపుగొట్టు కాపురాలు అంటూ లక్షలాది కుటుంబాలు ఉసూరుమంటున్నాయి.

నిద్రమంచం దిగింది మొదలు మళ్ళీ మంచం ఎక్కేవరకూ మనుషుల జీవితాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. పెరిగిపోతున్న అవసరాలకి తగ్గట్లుగా ఆర్థిక వనరులు అందుబాటులో లేకపోవడంతో అనేక కుటుంబాలు ఆశ నిరాశల మధ్య ఊగిసలాడుతున్నాయి. చేతిలో నాలుగు రూకలుంటే చాలు... బతుకు బండి లాగేయొచ్చనుకుంటే, ఒకదానిని మించిన ఖర్చు మరొకటి మీదపడి సమస్యలు మరింతగా చుట్టుముడుతున్నాయి. ప్రభుత్వాలు ప్రజల మెడలు వంచి రకరకాల పన్నులు గుంజుతున్నాయి తప్ప "మీ ఆదాయం ఎంత-మీ ఖర్చులేమిటి?" అని మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ఆ'కలికాలం'లో వచ్చే ఆదాయానికీ, పెరిగిపోతున్న వ్యయానికీ పొంతన ఉండడం లేదు. సంపాదనకి - ఖర్చులకి లంకె కుదరడం లేదు. ఎవరెంత సంపాదించినా, పెరుగుతున్న ధరలు వాటిని మింగేస్తున్నాయి. "ధనం మూలం ఇదం జగత్" అన్నట్లుగా, ధనమే ఇప్పుడు అన్నిటినీ శాసిస్తోంది. అది లేనివాళ్ళ జీవితాలను ఇలాగే చావండంటూ.. శపిస్తోంది. పాలకవర్గాలు, ప్రభుత్వాలు మాత్రం ఎవరెటు పోతే మాకెందుకన్నట్లు చోద్యం చూస్తున్నాయి.

## ఆదాయం జానెడు.. వ్యయం బారెడు

ఒక కుటుంబం, అంటే ఉదాహరణకు, ఓ భార్యా భర్త, ఇద్దరు పిల్లలు, ఒక ముసలి తల్లి, తండ్రి.. కనీసం అయిదారుగురు ఉంటారనుకుందాం. వారిలో సంపాదన మాత్రం ఒకరిదే ఉంటుంది. లేదా ఒకవేళ భార్యాభర్త ఇద్దరూ సంపాదనపరులైనా, వారికొచ్చే నెలవారీ వేతనాలు వారి కుటుంబ ఖర్చులకు సరిపోవడం లేదు. పాలబిల్లు, కరెంటు బిల్లు, డిష్ బిల్లు, ఫోన్ బిల్లు, నెట్ బిల్లు, ఇంటి అద్దె, పిల్లల స్కూలు ఫీజులు, పెట్రోలు బిల్లు, పిల్లల ఆటో బిల్లు, పెద్దల ఆసుపత్రుల బిల్లు వీటితోపాటు అనుకోని చుట్టాలు ఇలా రకరకాల ఖర్చులు. వీటికి తోడుగా బంధుమిత్రుల ఇళ్ళల్లో శుభకార్యాలు, ఇరుగు పొరుగు వారి పేరంటాలు వంటి ఖర్చులు ఒకదానిని తరుముకుంటూ ఇంకొకటి గోరుచుట్టుపై రోకలిపోటులా మీదపడిపోతుంటాయి.

ఇలాంటి పరిస్థితులలో ఆ కుటుంబాల్లో ఆనందం అన్న మాటకి చోటేలేదు. ఇక ఏ సినిమాకో షికారుకో వెళ్లాలన్నా అది కలగానే మిగిలిపోతోంది తప్ప ఆచరణ సాధ్యం కాదు. కారణం, పాతకాలంలో రూపాయిస్తే సినిమా టిక్కెట్టిచ్చే వాళ్ళు, ఇప్పుడా రోజులు పోయాయి. మల్టీప్లెక్సుల యుగంలో ఒక కుటుంబం సినిమాకి వెళ్లాలంటే కనీసం వెయ్యి రూపాయలు కావాలి. ఒక్కసారి ఆసుపత్రిలో అడుగుపెడితే అంతే మటాష్. డాక్టర్లు రాసే పరీక్షలు, డాక్టరు ఫీజు, ల్యాబ్ రుసుం, వగైరాలకి కనీసం వెయ్యి ఎగిరిపోతుంది. ఇక మందుల జోలికి వెళ్తే కనీసం మరో వెయ్యో రెండువేలో వదిలిపోతాయి. మారుతున్న కాలానికి తగ్గట్లుగా రకరకాల కొత్త జబ్బులు సామాన్యులచేత డబ్బులు ఖర్చుచేయిస్తున్నాయి. ఇలాంటివన్నీ ఎవరికీ చెప్పుకునే అవకాశం లేదు. ఒకవేళ చెప్పుకున్నా అర్చేదెవరు, తీర్చేదెవరు అంటూ... సామాన్య, మధ్యతరగతి ప్రజలు గోడుగోడుమంటున్నారు.

## ధనమేరా.. అన్నిటికీ మూలం..!

నేటి ఆధునిక కాలంలో పాశ్చాత్య సంస్కృతి రాజ్యమేలుతోంది. ప్రపంచీకరణ ప్రభావంతో అంతా 'మనీ' సంబంధాలే తప్ప, మానవ సంబంధాలు కరువయ్యాయి. ఆప్యాయత, అనురాగం మాయమయ్యాయి. మానవత్వం మంటగలిసిపోయింది. నైతిక విలువలు అంతరించిపోయాయి. ఎలా సంపాదించావని కాదు.. ఎంత సంపాదించావన్నదే లెక్క. "ధనమేరా అన్నిటికీ మూలం" అన్నట్లుగా, దండిగా నోట్లకట్టలుంటేనే ఇప్పుడు మనిషికి విలువ. ఆస్తులు అంతస్తులు లేకున్నా.. నిజాయితీగా ఉండేవారికి గతంలో సమాజంలో ఎంతో కొంత గౌరవం ఉండేది. ఇప్పుడది చేతగానితనమైపోయింది. డబ్బే ప్రధానమైపోయిన నేటి సమాజంలో అందుకు తగ్గట్టుగా మనుషుల తత్వాలు, మనస్తత్వాలు కూడా మారిపోయాయి. అన్నదమ్ముల బంధాలు, అక్కాతమ్ముళ్ళ అనురాగాలు, అన్నాచెల్లెళ్ళ అభిమానాలు, చివరికి భార్యాభర్తల బంధాలు, రక్త సంబంధాలు కూడా క్రమేణా క్షీణించిపోతున్నాయి. సంతోషాలకు పుట్టినిళ్ళుగా ఉండే ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైపోతున్నాయి. ఎక్కడ చూసినా ధనాశ, స్వార్థం, గర్వం, అహంకారం, ఒకరిపై ఒకరికి ఆధిపత్యభావం వంటివన్నీ చేరి, పచ్చని కాపురాల్లో చిచ్చుపెడుతున్నాయి. ఇక మన సంస్కృతి సంప్రదాయాలు, మంచి అలవాట్లు ఆలోచనలు వంటివన్నీ పెడచెవిన పెడుతున్నారు. వాటి గురించి మాట్లాడిన వారిని పిచ్చివాళ్ళలా చూస్తున్నారు.

## మారిన తరాలు... పెరుగుతున్న అంతరాలు!

తరాలు మారాయి.. అంతరాలు పెరిగాయి. అసమానతలు ఇంకా పెరిగిపోతూనే ఉన్నాయి. డబ్బున్నవారికే విలువ. ధనవంతులకే సమాజంలో గౌరవం. అప్పుడెప్పుడో యాభై సంవత్సరాల క్రితం (1973) వచ్చిన "డబ్బుకి లోకం దాసోహం" చిత్రం నుండి ఇటీవల విడుదలై ఘనవిజయం సాధించిన "లక్కీ భాస్కర్" సినిమా వరకూ అలాంటి సందేశాన్నే ఇచ్చాయి. ఇకనైనా ఆ దుర్గతి పోవాలని ఆ దేవుడిని కోరుకోవడం తప్ప.. మనం చేయగలిగిందేమీ లేదు. నిజం మాట్లాడుకోవాలంటే.. ఇవన్నీ మన చేయిదాటిపోయి గతంగా మిగిలిపోయాయి!

- రాజశ్రీ



# అట్టహాసంగా శీనయ్య పదవీ స్వీకారోత్సవం

**• 'నుడా' ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి**

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈనెల 17న పదవీ ప్రమాణస్వీకారం చేశారు అభిమానుల కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య శీనయ్య ఆ బాధ్యతలు చేపట్టారు. తొలుత, నగరంలోని నర్తకి సెంటర్ నుండి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డితో పాటు వేలాది కార్యకర్తలు, అభిమానులు వెంట రాగా భారీ ర్యాలీగా నుడా కార్యాలయానికి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేరుకున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి, ఉదయగిరి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్, నుడా వీసీ సూర్యతేజ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, అందరి సహకారంతో నెల్లూరుజిల్లా సర్వతోముఖాభివృద్ధికి శ్రీనివాసులురెడ్డి కృషి చేయాలన్నారు. కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి కష్టపడినందునే ఆయనకు ఈ పదవి వరించిందన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో నెల్లూరుజిల్లా సమగ్రాభివృద్ధి సాధనే లక్ష్యంగా నుడా పనిచేయాలన్నారు. నుడా మాస్టర్‌ప్లాన్ ప్రకారం నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేయాలన్నారు.

### నెల్లూరును మోడల్‌సిటీగా చేస్తాం

పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, 21 అర్బన్ అథారిటీలు ఉన్నాయని, పట్టణ జనాభా 34శాతం వృద్ధితో ఎప్పటికప్పుడు పెరుగుతుందని తెలిపారు. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం టౌన్ ప్లానింగ్ అనుమతుల్లో ప్రజలకు అనుకూలమైన విధి విధానాలను ప్రభుత్వం రూపకల్పన చేస్తుందని, త్వరలోనే ఖరారు చేసి విడుదల చేస్తామన్నారు. సంపద సృష్టి ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమన్నారు. నెల్లూరు నగరానికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి రాష్ట్రంలోనే మోడల్‌సిటీగా నెల్లూరు నగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

### నగరానికి ఔటర్‌రింగ్ రోడ్డు సాధించాలి

మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి రాజకీయాల నుండి ఎదిగిన వ్యక్తి శ్రీనివాసులరెడ్డి అన్నారు. నుడా పరిధి కేవలం నెల్లూరు నగరం మాత్రమే కాదని, జిల్లా మొత్తం వ్యాపించి ఉన్నందున అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటూ, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ సారథ్యంలో జిల్లాను బాగా అభివృద్ధి చేయాలని సూచించారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు సాధించాలని చెప్పారు.

### కష్టపడి పనిచేసినవారిని పార్టీ మరచిపోదు

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, నుడా పరిధిలోని సమస్యలను గుర్తించి, నాయకులందరి సహకారంతో ఆ సమస్యల పరిష్కారానికి శ్రీనివాసులురెడ్డి చర్యలు చేపట్టాలన్నారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ అభివృద్ధి కోసం శ్రమించిన కార్యకర్తలందరి తరపున లభించిన పదవిగా నుడా ఛైర్మెన్ పదవిని భావించాలని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారెవరినీ పార్టీ మరచిపోదన్నారు.

కేంద్ర మాజీమంత్రి, టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ విశాఖపట్నం, విజయవాడ మాదిరిగానే నెల్లూరు నగరాన్ని కూడా అభివృద్ధిపథంలో పయనింపజేయాలని కోరారు.

జిల్లాలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుల్లో ముఖ్యులైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి నుడా ఛైర్మెన్ పదవి లభించడం సంతోషకరమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు.

### నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా - శీనయ్య

నుడాకి కొత్త ఛైర్మెన్‌గా పదవిని చేపట్టిన కోటంరెడ్డి శీనయ్య మాట్లాడుతూ, నెల్లూరు నగరాభివృద్ధికి ఇదో మంచి అవకాశమన్నారు. ఐ లవ్ నెల్లూర్ నినాదంతో పరిశుభ్రమైన, సుందరమైన నెల్లూరును తీర్చిదిద్దటానికి ప్రయత్నిస్తానని, అదేవిధంగా జిల్లా మంత్రుల సహాయసహకారాలతో నుడా పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని చెప్పారు. తనకు వచ్చిన ఈ పదవి కార్యకర్తలు పెట్టిన బిక్ష అని, అందుకు సహకరించిన కూటమి నాయకులకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్‌సిసి కేడెట్ల ఆధ్వర్యంలో.. 'విజయ్ దివస్'




నెల్లూరులోని 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదన్గవే ఆదేశాల మేరకు, ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఈనెల 16న జాతీయ పతాకాన్ని ఎగురవేసి, భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. స్థానిక కెవిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి కేడెట్లు జాతీయపతాకాలను చేతపట్టి 'విజయ్ దివస్'ను ఘనంగా జరుపుకున్నారు. 1971లో భారత్-పాకిస్తాన్ మధ్య సంభవించిన యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో 'విజయ్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆ యుద్ధంలో అమరులైన భారత సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. నరేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ, దేశభక్తి, అంకిత భావంతో రాణించాలని, ప్రతిఒక్కరూ జాతీయ సమైక్యత కలిగి ఉండాలని చెప్పారు. కెవిఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. విజయప్రకాష్‌రావు, ఎన్‌సిసి కేడెట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**డిసెంబరు 31న**

# అల్లూరు జాతర

**తొలి చాటింపు వేశారు**

జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన అల్లూరు జాతర డిసెంబరు 31వ తేదీ మంగళవారం నాడు అత్యంత వైభవంగా జరుగనుంది. అల్లూరు గ్రామదేవతలైన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు పెద్దఎత్తున జరిగే ఈ జాతరకు ఈనెల 17న మంగళవారం నాడు తొలి చాటింపు వేశారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా గ్రామ శక్తి శ్రీ పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేసి, జాతరకు మొదటి చాటింపు వేయించారు. ముగ్గురమ్మల గ్రామోత్సవం అల్లూరు ఊరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతుందని, ప్రజలు పెద్దసంఖ్యలో జాతరకు తరలివచ్చి అమ్మవార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# స్థానిక సంస్థలకు ఎంత నిధులిచ్చారు?

**లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులలో మొదటి విడత అందించిన నిధుల వివరాలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల లోక్‌సభలో ప్రశ్నించారు. అందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భఘేల్ లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తూ, గ్రామీణ స్థానిక సంస్థల (ఆర్ఎల్‌బీలు) కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన గ్రాంట్ల మొదటి విడతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విడుదల చేశామని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు రూ. 593.26 కోట్లు టైడ్ గ్రాంట్, రూ. 395.51 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్లను అందించినట్లు వివరించారు. వీటిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లా పంచాయతీలు, బ్లాక్ పంచాయతీలు మరియు గ్రామ పంచాయతీలకు వరుసగా 70, 15, 15శాతం నిష్పత్తిలో నిధులు అందించబడతాయని వివరించారు.

# సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**--- అధికారులతో సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ ---**



భూ ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తెస్తోందని, దీనికి సంబంధించిన నియమ నిబంధనలు రూపొందిస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ చెప్పారు. ఈనెల 1న నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి ఆయన పలుశాఖల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తప్పులు, భూకబ్జాలతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రైతుల పాస్‌పుస్తకాలు, హద్దురాళ్లపై జగన్ బొమ్మలు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. సుమారు పదిలక్షల కోట్లకుపైగా అప్పులు మిగిల్చిపోయారన్నారు. ఈ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను జిల్లాస్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్, జేసీలకి సూచించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో ఎండోమెంటు భూసమస్యల పరిష్కారానికి కూడా సత్వర చర్యలు చేపట్టాలని చెప్పారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ చట్టం త్వరలోనే అమలులోకి వస్తుందని చెప్పారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీలో గతంలో జరిగిన పనులు సక్రమంగా జరిగాయో లేదో విచారించి బిల్లులు మంజూరు చేయాలని డ్వామా పీడీకి సూచించారు. పేదల భూములు ఆక్రమించిన వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వెంకటగిరి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, కాకర్ల సురేష్ పాల్గొన్నారు.

# రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపుకు.. తేజస్వి



రానున్న జనవరి 26వ తేదీన ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపుకు నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ యల్ తేజస్వి ఎంపికైంది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య విజయభాస్కరరావు ఫుడ్ టెక్నాలజీ విభాగంలో ఎంఎస్సీ చదువుతున్న తేజస్విని అభినందించారు. నవంబర్ 12 నుంచి 26 వరకు మహారాష్ట్రలోని జలగాంలో జరిగిన పదిరోజుల ప్రీ రిపబ్లిక్ పెరేడ్ క్యాంపులో యూనివర్సిటీ నుంచి ముగ్గురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొంటే, వారిలో ఒకరు ఎంపికయ్యారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి పదిమంది వాలంటీర్లు ఎంపిక అయితే వారిలో ఒకరు విశ్వవిద్యాలయం నుంచి ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ కె సునీత, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఆర్ మధుమతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్‌బి సాయినాథ్ తదితరులు తేజస్వికి శుభాకాంక్షలు తెలిపారు.

# చలిగాలులతో వణుకుతున్న జిల్లా

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గత రెండురోజులుగా జిల్లాలో ముసురు వాతావరణం ముసురుకుంది. మంచు, చలిగాలులు జిల్లా ప్రజానీకాన్ని వణికిస్తున్నాయి. అల్పపీడనంతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ఇప్పటికే జిల్లాలో అక్కడక్కడా వాన జల్లులు కురుస్తూనే ఉన్నాయి. నాలుగు రోజుల పాటు ఒక మోస్తరు నుంచి భారీ వానలు కురవవచ్చని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళవద్దని, బోట్లు-వలలు జాగ్రత్త చేసుకోవాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. అదేవిధంగా, పెన్నా నది పరీవాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా హెచ్చరించారు.

### విపిఆర్ స్కూల్ విద్యార్థిని శివగాయత్రికి

# వేమిరెడ్డి దంపతుల అభినందన



నంద్యాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో నెల్లూరులోని విపిఆర్ స్కూల్‌కు చెందిన శివగాయత్రి అద్భుత ప్రతిభతో ద్వితీయ స్థానం దక్కించుకుంది. యోగ శిక్షకుల విభాగంలో విపిఆర్ స్కూల్ యోగ కోచ్ ప్రసన్న కుమార్ కూడా ఈ పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకొని సిల్వర్ మెడల్ సాధించారు. యోగ క్రీడలో రాష్ట్ర స్థాయిలో రాణించిన శివ గాయత్రిని, కోచ్ ప్రసన్నకుమార్‌లను ఈ సందర్భంగా విపిఆర్ విద్యాసంస్థల ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కరస్పాండెంట్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో తమ స్కూల్‌కు ద్వితీయ బహుమతి లభించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్‌లో జరిగే జాతీయస్థాయి యోగ పోటీలలో శివగాయత్రి ప్రథమ స్థానంలో నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో 'తిరుప్పావై'



నెల్లూరులోని రంగనాయకులపేటలో వెలసివున్న శ్రీ వేదాంత దేశికర్ దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన తిరుప్పావై కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ధర్మ ప్రచార ధనుర్మాస యాత్ర ఆచార్యులు శ్రీమద్ పరవకోట చిన్న ఆండవన్ స్వామీజీ తిరుప్పావై విశిష్టతలను తెలియజేస్తూ ప్రవచనాలు చేశారు. నెల్లూరులో ధనుర్మాసంలో ఎంతో వైభవంగా తిరుప్పావై కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆయన శ్రీరంగం నుంచి విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి వేదాంత దేశికర్ దేవస్థానం వారు ఆలయ మర్యాదలతో సాదరంగా ఆహ్వానించారు. కెసి వరదరాజన్, కె.రామదొరై, ఎన్‌సి బాలాజీ, బండేపల్లి రాజ గోపాల్, రమేష్‌తో పాటు పలువురు రంగనాథ స్వామి గోష్టి సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం..24న

జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం ఈనెల 24న జడ్పీలో జరుగుతుందని జడ్పీ సిఇఓ విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమీక్షల్లో, కేంద్రప్రభుత్వానికి సంబంధించిన 42 పథకాలపై సమీక్ష జరుగుతుందని, జిల్లా స్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# పొట్టి శ్రీరాములు త్యాగనిరతి అపూర్వం



తెలుగు భాష మాట్లాడేవారి కోసం ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆ బృహత్కార్యంలో తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి అపూర్వమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కీర్తించారు. అమరజీవి ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని ఈనెల 15న నెల్లూరులోని తమ నివాసంలో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వతంత్ర భారతదేశ సాధనకై గాంధీ మహాత్ముడు చూపిన అహింసా మార్గంలో పయనించిన మహనీయులు పొట్టి శ్రీరాములని, ఆ మహోన్నత సేవా తత్పరుని వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అమరజీవి 'ఆత్మార్పణ దినం'గా డిసెంబరు 15న నిర్వహించడం.. వారి సేవలకు దక్కిన గౌరవమని ప్రస్తుతించారు.

### అవార్డు స్వీకర్తలకు..

# 'కళాంజలి' సత్కారం




ప్రముఖ రచయిత, దర్శకుడు..నెల్లూరులోని కళాంజలి సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కళాంజలి అనంత్ దర్శకత్వంలో రూపొందిన 'షీ'-ద పవర్ అనే షార్ట్ ఫిల్మ్‌కు ఇటీవల హైదరాబాద్‌లోని వీ-వరల్డ్ వారు నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్‌ల పోటీలో రెండు అవార్డులు లభించిన విషయం తెలిసిందే. 'షీ' షార్ట్ ఫిల్మ్‌కు ఒక జ్యూరీ అవార్డు, ఉత్తమ సంగీత దర్శకుని అవార్డు లభించాయి. ఈ సందర్భంగా ఈనెల 15న నగరంలో జరిగిన కార్యక్రమంలో కళాంజలి అనంత్ తన చిత్రంలో నటించిన కళాకారులను, సాంకేతిక నిపుణులను ఘనంగా సన్మానించారు. సంగీత దర్శకుడు సంగీత్‌సౌరభ్‌ను పూలకిరీటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీరిశెట్టి హజరత్‌బాబు, మెట్టు రామచంద్రప్రసాద్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, ఎం.ప్రసన్నాంజనేయులుతో పాటు, అవోపా మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు శైలజ, కావ్యశ్రీ, కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి పాల్గొని సంగీత్‌సౌరభ్‌ను అభినందించారు.

ఈ కార్యక్రమంలో షీ-షార్ట్‌ఫిల్మ్ నటీనటులు ప్రముఖ రచయిత డాక్టర్ కె.రామచంద్రమూర్తి (హైదరాబాద్), ప్రముఖ హాస్యనటుడు దొర్నాల హరిబాబు, బిల్లీ శ్యామ్‌సన్, ఉపేంద్ర ధీరజ్, దువ్వూరు బెనర్జీ, హజరత్, శివకుమార్ రెడ్డి, సోమిశెట్టి శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మహిళలకు అండగా ఉంటా!

### - మంత్రి నారాయణ సతీమణి రమాదేవి హామీ



మొన్నటి ఎన్నికల సమయంలో ప్రచారాలకు వచ్చిన నేతలు.. గెలిచిన తర్వాత సాధారణంగా ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం తెలిసిందే. కానీ.. మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి మాత్రం ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. దివ్యాంగులకు వీల్‌ఛైర్లు, వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేస్తూ, పేదప్రజలకు అండగా తానున్నానంటూ భరోసా ఇస్తున్నారు. తాజాగా నగరంలోని ముస్లిం మహిళ లతో ఆమె ఇటీవల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అందరినీ చిరునవ్వుతో పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ముస్లిం మహిళకు తన సహకారం తప్పకుండా ఉంటుందని చెప్పారు. వారికి ఎలాంటి కష్టం వచ్చినా తనను సంప్రదించాలని, తన భర్త నారాయణ గెలుపు కోసం పనిచేసిన ప్రతిఒక్కరికి తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం నారాయణ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ముస్లిం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

# విద్యుత్‌ను పొదుపు చేయాలి



నిత్యావసరమైన విద్యుత్తును పొదుపు చేయాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నెల్లూరు నగరంలోని విద్యుత్ భవన్ నుండి కస్తూర్బా కళాక్షేత్రం వరకు విద్యుత్ ఉద్యోగులు ఇంధన పొదుపు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. జేసీ కార్తీక్, విద్యుత్ శాఖ ఎస్ ఇ విజయన్‌తో కలిసి ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రజలందరూ విద్యుత్‌ను అవసరం మేరకే వాడుకోవాలని కోరారు.

# క్యాన్సర్ ఆసుపత్రికి..4 లక్షల విరాళం



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి స్వర్గీయ చింతా లలితమ్మ జ్ఞాపకార్థం శ్రీమతి దేవళ్ళ శ్యామల ఇటీవల 4లక్షల రూపాయల చెక్‌ను రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఛైర్మెన్.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి తమ విరాళంగా అందజేశారు. రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యం.నాగేశ్వరరావు, ఆర్థోపెడిక్స్ డాక్టర్ హరికృష్ణారెడ్డి, జనరల్ మేనేజర్ ఐ.భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






### ప్రాజెక్టుల గేట్ల నిర్వహణకు..

# ఆపరేటర్లను నియమించండి

### --- మిడతల రమేష్ వినతి ---

జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టుల గేట్ల నిర్వహణకు అవసరమైన ఆపరేటర్లను వెంటనే నియమించాలని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఇటీవల సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన సోమశిల – కండలేరు – సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌ల వద్ద నీటి నిర్వహణ చేసేందుకు ఆపరేటర్లు లేరని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు బ్యారేజ్



వద్ద నీటి నిల్వలు చూసే గేజ్‌ను ఇంకా ఏర్పాటు చేయలేదన్నారు. రాళ్లపాడు కుడి కాలువ మరమ్మతులకు గురై ఉందని, కుడికాలువ గేటు పైకి లేవకపోవడంతో రైతులకు సాగునీరు అందించలేకపోతున్నారన్నారు. దీంతో రైతులు నీటి కోసం ఆందోళన చేస్తున్నారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, నాయకులు చిలకా ప్రవీణ్ కుమార్, మారం కృష్ణ, చింత గింజల సుబ్రహ్మణ్యం, కేశవ, భాస్కర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగుల్లో వెల్లువెత్తుతున్న ఆనందం

- వేమిరెడ్డి దంపతుల కృషితో 2500 మందికి ఉద్యోగాలు
- జాబ్‌మేళాకు తరలివచ్చిన వేలాదిమంది యువత హర్షాతిరేకాలు

జిల్లాలో కనీవినీ ఎరుగని విధంగా వేమిరెడ్డి దంపతుల కృషితో నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తుండడంతో జిల్లాలోని నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత కోసం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళా నిరుద్యోగ యువతను బాగా ఆకట్టుకుంది. ఈ మెగా జాబ్ మేళాకు దాదాపు 8 వేల మంది హాజరు కాగా, 2,500 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఇందులో అక్కడికక్కడే 800 మందికి ఉద్యోగాలకు సంబంధించిన ఆఫర్ లెటర్స్‌ను కూడా వేమిరెడ్డి దంపతులు, నెల్లూరు రూరల్ నియోజక వర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అందజేయడంతో యువత ఆనందాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎంపికైన, మిగిలిన వారికి కూడా అందజేసేందుకు వేమిరెడ్డి దంపతులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, నిరుద్యోగుల కళ్ళలో ఆనందం చూడాలన్నదే తమ అభిమతమని, వారికి ఉద్యోగాలు కల్పించేందుకు ఒక నిరంతర ప్రక్రియగా జాబ్‌మేళా నిర్వహిస్తామని చెప్పడంతో, నిరుద్యోగ యువతలో సంతోషం వెల్లువెత్తింది. జాబ్ మేళాలో పాల్గొన్న ప్రతిఒక్కరికి వారి విద్యార్హతలు తగ్గ ఉద్యోగం రావాలని కోరుకుంటున్నానని, మూడు నెలలకు ముందు నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు దక్కాయని, ఈసారి 100కు పైగా ఐటి, నాన్-ఐటి కంపెనీలు ఉద్యోగావకాశాలు ఇస్తున్న నేపథ్యంలో మరింత ఎక్కువ మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. ఒకవేళ ఇప్పుడు కొంతమందికి ఉద్యోగావకాశాలు రాకున్నా, యువతీ యువకులు నిరుత్సాహ పడొద్దని, జాబ్ మేళా నిరంతర ప్రక్రియ అని, ప్రతి మూడు నెలలకు జాబ్ మేళా నిర్వహిస్తామని ఆయన వారికి భరోసా ఇచ్చారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను నిరుద్యోగరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకే మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేసే సామాజిక సేవలో భాగంగా నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, వారి కళ్ళలో ఆనందం చూడాలన్నది ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆశయమని ప్రశాంతిరెడ్డి చెప్పారు. టాటా కన్సెల్టెన్సీ వారు తమ స్కిల్ సెంటర్ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, వారి సూచనలు పాటించి మరో మూడు నెలల తరువాత నిర్వహించే జాబ్ మేళాలో యువత మరిన్ని అవకాశాలు దక్కించుకోవచ్చని ఆమె సూచించారు. అనంతరం వారు జాబ్‌మేళాకు వచ్చిన యువతకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డి, కుమార్తె నీలిమారెడ్డి అంతా తామే అయి ఈ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకరించడం అందరికీ మరింత సంతోషం కలిగించింది. డెప్యూటి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, బుచ్చిరెడ్డి పాళెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవికి ప్రశాంతమ్మ నివాళి



తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని కొనియాడారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలో ఈనెల 15న ఆమె అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, ప్రతి ఆంధ్రుడూ శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకోవలసిన అవసరం ఉందన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ప్రశాంతమ్మ తనయుడు అర్జున్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు స్థానిక ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షిస్తాం

పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి ఇటీవల వెంకటగిరి ఎంఎల్ఏ కురుగొండ్ల రామకృష్ణతో కలిసి రాపూరు మండలం, రావిగుంటపల్లి గ్రామంలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలతో.. పర్యావరణం కాపాడడాన్ని ఒక పెద్ద సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ అనేక పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాలను ఇక్కడ సేకరించి వాటిని ట్రీట్‌మెంట్ చేసి పర్యావరణం దెబ్బతినకుండా కాపాడతారని తెలిపారు. ఈ ప్లాంట్‌ల వల్ల భావితరాలకు మంచి వాతావరణాన్ని కల్పించడం వీలవుతుందన్నారు. దానిని ప్రభుత్వ బాధ్యతగా తీసుకుందని, ఇలాంటి ప్లాంట్స్ మరిన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని చెప్పారు. రాబోయే తరాలవారికి మంచి పర్యావరణం అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటిసారి ఒక కొత్త ఆలోచనా విధానంతో సాంకేతికంగా కూడా పరిశీలిస్తోందని తెలిపారు. పీసీబీ అధికారి అశోక్‌కుమార్, ఏపీఎంసిల్ జీఎం వెంకటేశ్వర్లు, చెన్ను తిరుపాల్‌రెడ్డి, వేంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మళ్ళీ వచ్చేశా అధ్యక్షా..!

బీద మస్తాన్‌రావు రాజ్యసభ సభ్యుడిగా రెండవసారి డిసెంబర్ 16న సోమవారం నాడు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం రాజ్యసభ ఛైర్మెన్ మరియు భారత ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్‌ఖడ్‌ని కలిసి అభివాదం చేస్తున్న మస్తానయ్య.

# త్వరలోనే ఆలయాలకు పాలకమండళ్ళు

**- దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి -**



రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, అన్ని ఆలయాలకు త్వరలోనే పాలక మండళ్ళను నియమిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 17న నెల్లూరులోని శ్రీ రంగనాథస్వామి ఆలయం సమీపంలో కొత్తగా నిర్మించిన దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయాన్ని ఆయన, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఆలయాలను పూర్తిగా విస్మరించిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆగమ శాస్త్రాలను గౌరవిస్తూ ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. గతంలో ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు రూ.5వేలు ఇస్తుండగా, 5400 ఆలయాల్లో ఒక్కొక్క ఆలయానికి ప్రస్తుతం రూ.10వేలు ఇస్తున్నామని, అర్చకులకు గతంలో రూ.10వేలు వేతనం ఇస్తుండగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15వేలు ఇస్తోందని తెలిపారు. అదేవిధంగా, వేద విద్యార్థులకు రూ.3 వేలు వంతున సంభావన అందించి వేదవిద్యను ప్రోత్సహిస్తున్నటు చెప్పారు. వేదాలు, ఆగమ శాస్త్రాలను పాటిస్తూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని మంత్రి వివరించారు. నెల్లూరు నగరంలో రూ.85 లక్షల రూపాయలతో సహాయ కమిషనర్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించామని, త్వరలోనే మొదటి అంతస్తు నిర్మాణ పనులను కూడా దేవాదాయశాఖ నిధులతో పూర్తి చేయిస్తామని చెప్పారు. రంగనాథస్వామి ఆలయ ఘాట్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు మంత్రి నారాయణ దృష్టి పెట్టినట్లు చెప్పారు. వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. త్వరలోనే సోమశిలలో శ్రీ సోమేశ్వరాలయం నిర్మాణ పనులు కూడా మొదలుకానున్నాయని తెలిపారు.





# జానకిరామ.. రామాయణం 44

- ఊటుకూరు జానకి రామారావు



హైలెస్సా హైలో హైలెస్సా అంటూ గంగలో ప్రయాణం చేస్తున్నాయి ఆ నావలన్నీ. కొంతమంది నావలను నడిపేవారు వాటిని చిత్రవిచిత్రరీతులలో నడుపుతున్నారు.

నది అంతా నావలు ఆక్రమించి జలంమీద ఒక మహానగరం నిర్మింపబడెనా అన్నట్లుంది.

భరతుడి నావ మైత్రీముహూర్తమందు ఆవలి ఒడ్డును చేరుకుంది. గుహుడు కూడా వారి వెంట ఉన్నాడు.

(మైత్రీ ముహూర్తమంటే ఉదయం 7.04 ని నుండి 8.36ని. రోజును పదిహేను భాగాలు చేయగా అందులో మొదటి మూడవ భాగం మైత్రీ ముహూర్తం అనబడుతుంది. అనగా రెండు ఘడియలు).

అల్లంత దూరాన భరద్వాజ మహర్షి ఆశ్రమం కనపడు తోంది. సైన్యాన్ని అక్కడే ఉంచి మహర్షి వశిష్ఠుల వారితో కలిసి భరతుడు ఆశ్రమం వైపుగా అడుగులు వేశాడు.

వశిష్ఠ మహర్షిని అల్లంత దూరంలో చూడగనే భరద్వాజ మహర్షి ఒక్క ఉదుటున లేచి శిష్యులను అర్ఘ్యము అర్ఘ్యము అని తొందర పెడుతూ మహర్షికి ఎదురేగాడు.

వశిష్ఠ మహర్షి భరతుని చూపి ఈతడు దశరథ కుమారుడు అని పరిచయం చేశారు.

తరువాత వారందరి క్షేమం భరద్వాజుడు విచారించి భరతునితో ఇలా అన్నాడు... "రాజ్యాన్ని పరిపాలించుకొనే నీవు ఇచటికి ఎందుకు వచ్చావు? నా కేదో అనుమానంగా ఉంది నీ గురించి! తండ్రి మాట కోసమై అడవులుపట్టి వెళ్ళిపోయిన సీతారామలక్ష్మణుల విషయమై నీవేమీ పాపపు తలంపుతో ఇచటకు రాలేదు కదా!".

ఆ మాటలు భరతుని హృదయాన్ని ఈటెల్లాగా చీల్చివేయగా హృదయమందు అప్పటికే గంగానదిలా ప్రవహిస్తున్న దుఃఖం మరింత వేగంగా ఉబికి బయటకు వచ్చి కన్నీరుగా ప్రవహించగా, తడబడే మాటలతో భరద్వాజుని చూసి...

"పూజ్యుడవైన నీవు కూడా నన్ను ఇలాగ భావించినచో నన్ను చంపివేసినట్లే! మహాత్మా నావలన ఏ దోషములేదు! నన్ను నీవు ఈ విధంగా తలంచకుమయ్యా! నేను లేని సమయంలో నా తల్లి పలికిన మాటలన్నీ నాకు ఇష్టాలు కావు, వాటిచే నాకు సంతోషం కలుగలేదు. వాటిని నేను సమ్మతించను. నేను ఇప్పుడు పురుషశ్రేష్ఠుడైన రాముని పాదాలకు నమస్కరించి ఆయనను అనుగ్రహింపచేసుకొని మరల అయోధ్యకు తీసుకు వెళ్ళటానికి వచ్చిఉన్నాను. మహర్షీ రాముడెక్కడున్నాడో ఎరుకపరుపుము!"

సత్ప్రవర్తన, వినయంతో కూడిన భరతుని మాటలు విని భరద్వాజ మహర్షి ప్రసన్నుడై రఘువంశంలో పుట్టినవాడు మాట్లాడే విధంగానే మాట్లాడావు. అవి నీకు తగి ఉన్నవి.

నీ హృదయం తెలుసుకుందామనే అలా అన్నాను! అని పలికి నీ సోదరుడు ఎక్కడ ఉన్నాడో నాకు తెలుసు..

రాముడు చిత్రకూట పర్వతమందు నివసిస్తున్నాడు, నీవు రేపు అచటికి వెళ్ళవచ్చును ఈ రాత్రికి మా ఆశ్రమమందే విశ్రమించు...

భరద్వాజుని కోరికమేరకు ఆ రాత్రికి అక్కడనే విడిదిచేశాడు భరతుడు.

అప్పుడు భరద్వాజుడు భరతునితో, నేనిచ్చే విందు స్వీకరించు అని అడిగాడు.

స్వామీ అరణ్యంలో లభించేవాటిని మీరిప్పటికే నాకు అనుగ్రహించారు కదా... ఇంక వేరే విందు ఏమివ్వగలరు? అని బదులు పలికాడు భరతుడు.

మహర్షి చిరునవ్వుతో, భరతా! నీవు అల్పసంతోషివి అని నేనెరుగుదును. నీవు అన్ని సత్కారాలకు అర్హుడవు! నీకు, నీ సేనకు ఏమిస్తే.. సంతుష్టులగుదురో ఆ విందు ఇవ్వవలెననే కోరిక నాకుంది.

అవునూ! నీ సైన్యాన్నంతా దూరంగా వదిలి ఒక్కడవే ఇక్కడికి వచ్చావేమిటి? అని ప్రశ్నించాడు భరద్వాజుడు.

స్వామీ మీకు తెలియనుకదా, రాజు కానీ, రాజపుత్రుడు కానీ ఎల్లవేళలా మునివాటికలకు దూరంగా సంచరించవలెను అని కదా నియమం!

నా సైన్యంలో మదించిన ఏనుగులు సంచరిస్తున్నాయి. అవి మీ ఆశ్రమప్రాంగణంలోని వనాన్ని ధ్వంసం చేయరాదనే తలంపుతో నేనొక్కడనే వచ్చాను.

భరతుని మాటలు విని సంతసించారు మహర్షి.

అప్పుడు మహర్షి అగ్నిగృహంలో ప్రవేశించి దీక్షలో కూర్చొని విశ్వకర్మను ఆహ్వానించాడు, దేవేంద్ర, యమ, వరుణ, కుబేర అనే లోకపాలకులని కూడా ఆహ్వానించి నేను భరతునకు ఆతిథ్య మివ్వదలుచుకున్నాను, కావున మీరు వచ్చి తగు ఏర్పాట్లు గావించండి అని కోరాడు.

మహర్షి సంకల్పానికి అనుగుణంగా అక్కడ క్షణాల్లో ఒక మహానగరం ఏర్పాటయ్యింది.

గంధర్వులైన విశ్వావసు,

హాహాహూహూలూ,

దేవజాతికి చెందిన అప్సరసలు

వారిలో ఘృతాచి, విశ్వాచి, మిశ్రకేశి, అలంబుస, నాగదంత, హేమ, హిమ... అనే స్త్రీలు ఉన్నారు. సకల దేవతా స్త్రీలను అక్కడకు రావించాడు మహర్షి.

మైరేయము అనే మద్యం నదిగా పారింది!

బాగా తయారు చేయబడిన "సుర" మరొక నది అయ్యింది,

చెరకు రసాలు నదులుగా పారాయి.

చంద్రుడు చక్కని అన్నం తెచ్చాడు. అది పంచభక్ష్య పరమాన్నాలతో కూడినటువంటుది.

భరద్వాజుడి సంకల్పానికి తగ్గట్లుగా అప్పటికప్పుడు అక్కడ ఒక సుందరమైన లోకం ఇంద్రభవనాలతో దేవేంద్ర వైభవంతో సృష్టింపబడింది.

ఇదివున్నది, అదిలేదు అనిలేదక్కడ!

ఎవరికి ఏది కావలిస్తే అది.

మహర్షి అనుమతితో భరతుడు రాజసభలోకి ప్రవేశించాడు.

ఆ సభలో ఒక సమున్నతమైన ఆసనం!

దానికెదురుగా మంత్రి సామంతదండనాథులు కూర్చొనేందుకు వీలుగా సముచిత సుఖాసనాలు అమర్చారు.

అక్కడి దివ్యమైన సమున్నత ఆసనానికి భరతుడు ప్రదక్షిణ చేశాడు. అక్కడ రాముడున్నట్లుగా ఊహించుకొని ఆయనకు నమస్కారం చేసి ఆ ఆసనానికి వింజామరతో వీచి తాను మంత్రికూర్చునే ఆసనం మీద కూర్చున్నాడు.

భరద్వాజ మహర్షి ఇచ్చిన విందుతో మైమరచిపోయా రందరూ. ఏ పానీయం కావాలంటే ఆ పానీయం నది రూపంలో ప్రవహించిందక్కడ.

ఏ జవరాలి చేతిలో చిక్కితే మగవాడు తనను తాను మరచి పోయి చిత్తయిపోతాడో అలాంటి జవరాండ్రు వేలకువేలు ప్రత్యక్షమయ్యారక్కడ.

నారదుడు, తుంబురుడు, గోపుడు భరతుని ఎదుట గానం చేశారు.

భరద్వాజుని ఆజ్ఞచేత ఆయన మునివాటికలోని వృక్షాలన్నీ రకరకాల మనుష్యరూపాలు ధరించాయి.

మారేడు చెట్లు మృదంగవాద్యకారులుగానూ, తాండ్రచెట్లు తాళంవేసేవారుగానూ, రావిచెట్లు నర్తకులుగానూ, సరళ, తాళ, తిలక, నక్తమాల వృక్షాలు అంతఃపురంలో సంచరించే కుబ్జలు గాను, వామనులుగానూ మారిపోయినాయి. శింశుపా, ఆమలకి, జంబూ, మల్లికా, మాలతి, జాజి లతలు లతాంగులైనవి.

ఒక్కొక్కపురుషుని ఏడుగురు స్త్రీలు చుట్టుముట్టి నలుగుపెట్టి స్నానం చేయించారు. మరల వారి శరీరమర్దనానికి అందమైన కళ్ళుగల స్త్రీలు త్వరగా వచ్చారు. శరీరం తుడుచుటకు ఒకతి, సురాపానం చేయించుటకొకతి. అందరూ వళ్ళుమరచి ఆనందంతో తైతక్కలాడసాగారు. ఆ విందులూ చిందులూ పొందులూ సైనికులను అదే శాశ్వతం అనుకునేటట్లుచేసింది.

వారికి రాజేలేడన్నట్లుగా, అదే సుఖం జీవితాంతం ఉండి అక్కడే ఉండిపోవాలని కోరుకున్నారు. వారికి భరతుడులేడు, రాముడు లేడు, ఆయన దండకారణ్యం లేదు!

ఎవరికి వారు విచ్చలవిడిగా రెచ్చిపోయి తాగితూలుతూ పచ్చిపచ్చిగా నచ్చినవెచ్చెలితో విహరిస్తూ సర్వం మరచిపోయారు.

తెల్లవారింది మహర్షి ఆజ్ఞ ఇవ్వగా ఎక్కడివారక్కడికి వెళ్ళి పోయారు. మరల మునివాటిక, అరణ్యం ప్రత్యక్షమయ్యింది అంతా ఒక కలలా అనిపించింది! కానీ కలకాదు! రాత్రి తాగిన మత్తువదలక అంతా అడవిలోని నేలపై పడిదొర్లుతున్నారు.

భరతుడు వినయంగా మహర్షిని సమీపించి స్వామీ మీ ఆతిథ్యం అనితరసాధ్యం. నేను, నా పరివారం అందరం సంతుష్టులమయ్యాం. మాకు ఇక సెలవు ఇప్పించండి. మా అన్నగారు బసచేసిన తావు చూపించండి అని ప్రార్థించాడు.

.. (సశేషం)

# ఇండియా కూటమిలో లుకలుకలు!

ఇండియా కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. వివిధ అంశాల్లో తలెత్తుతున్న అభిప్రాయ బేధాలను కూటమి పార్టీలు అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోకుండా బహిర్గతం చేసుకుంటుండడంతో ఆ కూటమి ఉనికి ఎంతకాలం అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కూటమిలో పెద్దన్నలా ఉండా లనుకుంటున్న కాంగ్రెస్‌తో మిగిలిన పార్టీలకు పొసగడం లేదని ఆ పార్టీల నేతల వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. భిన్న సైద్ధాంతిక దృక్పథాలున్న 26 పార్టీలు సాధారణ ఎన్నికలకు ముందు ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. ప్రధాని నరేంద్ర మోడీ దిశానిర్దేశంలో దూసుకుపోతున్న భాజపాను గద్దె నుంచి దించాలన్న ఏకైక లక్ష్యంతో ఇండియా కూటమి ఏర్పడింది. కూటమి ఏర్పాటు లక్ష్యాన్ని సాధించలేక పోయినా భాజపా సంఖ్యాబలాన్ని 240 స్థానాలకు తగ్గించగలిగింది. అయితే సాధారణ ఎన్నికల నాడు ఉన్న ఐక్యత ఇప్పుడు ఇండియా కూటమిలో కనిపించడం లేదు. గత వారం విపక్ష పార్టీలు రాజ్యసభలో రెండు అంశాల్లో మాత్రం ఏకాభి ప్రాయానికి వచ్చాయి. అందులో ఒకటి– రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అంశం కాగా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్‌కుమార్ యాదవ్‌ను అభిశంసించాలన్న డిమాండ్ మరొకటి. కానీ పలు అంశాల్లో మాత్రం అనైక్యత స్పష్టంగా కనబడుతోంది. ఒక్కొక్కరు ఒక్కో దిక్కులో పయనిస్తున్నారు. ముఖ్యంగా కూటమికి నాయకత్వం వహించే అంశంలో తీవ్ర విభేదాలున్నట్లు స్పష్టమవుతోంది. కాంగ్రెస్‌కు నాయకత్వం విషయంలో తృణమూల్ కాంగ్రెస్ నేరుగా సవాల్ విసిరింది. "మీకు చేతకాకపోతే నేను నాయకత్వం వహించడానికి సిద్ధం" అని ఆ పార్టీ అధినాయకురాలు మమతా బెనర్జీ స్పష్టం చేశారు. పేరుకు మల్లికార్జునఖర్గే కాంగ్రెస్ అధ్యక్షుడయినప్పటికీ రాహుల్‌గాంధీయే కాంగ్రెస్‌కు అనధికారికంగా నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. అంటే మమతా బెనర్జీ నేరుగా రాహుల్ గాంధీకే సవాల్ విసిరినట్లు.

జాతీయ రాజకీయాల్లో ప్రముఖపాత్ర పోషించాలన్నది మమత లక్ష్యంగా కనబడుతోంది. ఏడుసార్లు ఎంపీగా, మూడుసార్లు ముఖ్యమంత్రిగా, నాలుగుసార్లు కేంద్ర మంత్రిగా పని చేసిన తనకంటే సమర్థులెవరుంటారన్నది ఆమె పార్టీ తరఫునుంచి సంధిస్తున్న ప్రశ్న. ఆమె ప్రతిపాదనను కూటమిలోని కొన్ని పక్షాలు సమర్థిస్తుండగా మరికొన్ని వ్యతిరేకిస్తున్నాయి. సాధారణ ఎన్నికల ముందు ఇండియా కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించి, దానికి నాయకత్వం వహించాలనుకున్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు కళ్లెం వేయడానికి మమతాబెనర్జీయే మల్లికార్జున్ ఖర్గేను కూటమి ఛైర్మన్‌గా ప్రతిపాదించారు. నితీశ్‌కుమార్ ఇండియా కూటమి పూర్తిగా పురుడుపోసుకోక ముందే ప్లేటు ఫిరాయించి ఎన్డీయే కూటమిలో చేరిపో యారు. ఇండియా కూటమికి తాను నాయకత్వం వహిస్తానని తాజాగా మమత చేసిన ప్రతిపాదనకు సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్‌యాదవ్, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ సమర్థిస్తున్నారు.

మరో ముఖ్య విషయంలోనూ కాంగ్రెస్‌తో తృణమూల్ కాంగ్రెస్ విభేదిస్తోంది. ఆదానీ గ్రీన్‌పై అమెరికా న్యాయ విభాగం మోపిన అభియోగాలపై పార్లమెంట్‌లో పూర్తిస్థాయి చర్చకు కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఇందుకోసం ఇతర అంశాలన్నింటినీ ఆపాలని డిమాండ్ చేస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ ఇందుకు సుముఖంగా లేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, మణిపూర్‌లో అశాంతి తదితర అంశాలపై చర్చ జరగాలంటోంది. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి తృణమూల్ గైర్హాజరయింది. సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ–శరద్ పవార్, శివసేన–యూబీటీ, గతంలో ఆదానీ పై విమర్శలు చేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ కూడా ఇప్పుడు ఆదానీ అంశంలో కాంగ్రెస్ వైఖరిని సమర్థించడం లేదు.

ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనే సీట్ల పంపిణీ విషయంలో భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. మహారాష్ట్ర ఎన్నికల్లో ఇండియా కూటమి చతికిలపడడానికి దారితీసిన ముఖ్య కారణాల్లో సీట్ల పంపకంలో విభేదాలు ఒకటి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుందామని కాంగ్రెస్ చేసిన ప్రతిపాదనలను ఆమ్‌ఆద్మీ పార్టీ తోసిపుచ్చింది.

కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్న భాగస్వామ్య పార్టీల్లో తాజాగా జమ్మూకశ్మీర్‌కు చెందిన నేషనల్ కాన్ఫరెన్స్ కూడా చేరింది. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లు ఆ రాష్ట్రంలో కలిసి పోటీచేయగా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీయే సొంతంగా మెజార్టీ సాధించింది. అక్కడ కాంగ్రెస్ ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. ఈవీఎంలపై కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేయడాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా బహిరంగంగానే తప్పుబట్టారు. "మీరు ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంలలో సమస్య ఉందనడం సరికాదు" అని ఆయన విమర్శించారు. బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని గతంలో డిమాండ్ చేసిన పార్టీల్లో ఒకటైన తృణమూల్ కాంగ్రెస్ ఈ విషయంలో ఇప్పుడు కాంగ్రెస్‌తో విభేదించింది. ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేసేవారు వాటిని రుజువు చేయాలని తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్‌ను విమర్శించారు. ఇండియా కూటమిలో విభేదాలు ఇలానే కొనసాగితే వచ్చే సాధారణ ఎన్నికల నాటికి కూటమి ఈ రూపంలో ఉండకపోవచ్చు. మరింతగా బలహీనపడే అవకాశాలున్నాయి. ఇప్పుడిప్పుడే మొదలైన ఈ సంక్షోభాన్ని నివారించి ఇండియా కూటమిని ఐక్యంగా ఉంచడం కాంగ్రెస్‌కు పెద్ద సవాల్. ఈ సవాల్‌ను కాంగ్రెస్, ఆ పార్టీ అప్రకటిత అధినాయకుడు రాహుల్ ఎలా అధిగమిస్తారో వేచి చూడాలి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# ఎన్‌బికెఆర్‌తో.. జపాన్ సంస్థ ఒప్పందం



జపాన్ సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్య బదలాయింపు కోసం ఈనెల 18న కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఐఎస్టీ కళాశాలకు మెడివ్ షా కార్పొరేషన్ (టోక్యో) సంస్థతో అవగాహన ఒప్పందం కుదిరింది. మెడివ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కో యిమాయోటో, డైరెక్టర్ ఉకాయుకి సాహో, కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వినయ్‌సింగ్లా, మేనకూరులోని కంపెనీ హెడ్ రమేష్‌చంద్రసింగ్, హెచ్‌ఆర్ మేనేజర్ చైతన్య, ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొని, ట్రాన్స్‌ఫార్మర్ కంపెనీ అయిన మెడివ్ సంస్థ నైపుణ్యాలను ఇక్కడి ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా గత అయిదేళ్లలో ఇప్పటి వరకు 30 మంది విద్యార్థులు ఆ సంస్థలో పనిచేస్తున్నారని, ఈ ఏడాది కూడా మరికొంతమంది విద్యార్థులకు కోర్ కంపెనీల్లో అవకాశాలు కల్పిస్తామని విజయకుమార్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఆ కంపెనీ సాంకేతిక నైపుణ్యం బదలాయింపు కోసం తమ కళాశాల నుంచి 50 మంది విద్యార్థులను ఎంపికచేసుకున్నట్లు కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్ కిషాంధర్ తెలిపారు. మెకానికల్ విభాగాధిపతి విక్రమ్‌కుమార్, ఇఇఇ విభాగాధిపతి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన వృధాను తగ్గించుకోవాలి



జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా ఈనెల 14న కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇంధన పొదుపుతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, విద్యుత్‌ను వృధా చేయవద్దని సూచించారు. భవిష్యత్తులో ఇంధనం కొరత రాకుండా ఇప్పటినుంచే ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అన్ని విభాగాల అధిపతులు, ఐఐసి ఇన్‌చార్జి డా. పి.నందకుమార్, ఇడి సెల్ ఇన్‌చార్జి డా.శ్రీహరిరెడ్డి, ఐఎస్టీఇ ఇన్‌చార్జి డా.ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ హైస్కూల్..
# త్వరలో ప్రారంభం
## - మంత్రి నారాయణ



వచ్చే యేడాది మార్చి లోగా నెల్లూరులోని వీఆర్ ఉన్నత పాఠశాలను పునః ప్రారంభించి అన్ని తరగతులు ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈనెల 18న ఆయన నెల్లూరు నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాలను, జాయింట్ కలెక్టర్ కార్తీక్, కమిషనర్ సూర్యతేజలతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాలుగు మోడల్ స్మార్ట్ స్కూల్స్‌ను ప్రారంభిస్తామని, ఆమేరకు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని మంత్రి వెల్లడించారు.

# సాగునీటి ఎన్నికలు ప్రశాంతం

ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత, ఈ నెల 14న జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 486 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగగా.. 477 ఏకగ్రీవమయ్యాయి. 3,649 టీసీలకు ఎన్నికలు నిర్వహించగా, వైకాపా ఈ ఎన్నికల నుంచి తప్పుకోవడంతో, అధికార తెలుగుదేశం పార్టీ వారే ఏకగ్రీవంగా నిలిచారు. కొన్ని చోట్ల స్వల్ప వాదోపవాదాలు, ఉద్రిక్తతలు కన్పించినా మొత్తమ్మీద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల తొలిదశ ప్రక్రియ పూర్తికావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

# అమరజీవి త్యాగం..సదా చిరస్మరణీయం
## చెన్నైలో శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సభలో వక్తలు



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి, ఆత్మార్పణ దినం సందర్భంగా చెన్నై-మైలాపూర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో డిసెంబరు 15న అమరజీవి త్యాగాన్ని స్మరించుకున్నారు. కమిటీ అధ్యక్షులు కె. అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథరెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య సెక్రటరీ జనరల్ కె.లక్ష్మీమోహన్‌రావు తదితరులు పాల్గొని అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన అమరజీవి త్యాగం చిరస్మరణీయమని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. నిడమర్తి వసుంధర 'తెలుగుతల్లి' ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి వి. కృష్ణారావు, సంయుక్త కార్యదర్శి ఊరా శశికళ, సభ్యులు విస్తాలి శంకరరావు, 'జనని' ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, ఆనంద్‌కుమార్‌రెడ్డి, ఎల్‌బి శంకరరావు, ఇస్రాయేలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.కృష్ణారావు రచన, ఎన్.గోపాలయ్య దర్శకత్వంలో ప్రదర్శించిన 'స్వాతంత్ర్యయోధులు మళ్ళీ పుడితే' దృశ్యనాటిక అందరినీ ఆకట్టుకుంది.

# 22న..'అద్వైత భారత్' నవల ఆవిష్కరణ

చతుర్వేదుల చెంచుసుబ్బయ్యశర్మ (చెన్నై) రచించిన 'అద్వైత భారత్' నవల ఆవిష్కరణ సభ ఈనెల 22వ తేదీ ఆదివారం నెల్లూరులో జరుగుతుందని పెన్నా రచయితల సంఘం(పెరసం) నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం 9.30గంటలకు స్టోన్‌హౌస్ పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి ఆ నవలను ఆవిష్కరిస్తారని, ప్రథమకృతిని మోపూరు పెంచలనరసింహం స్వీకరిస్తారని, అవ్వారు శ్రీధరబాబు సమీక్షిస్తారని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.కుమార రాజా, ప్రముఖ సాహితీవేత్తలు పొట్లూరు సుబ్రహ్మణ్యం, చిన్ని నారాయణరావు, ఇంద్రగంటి మధుసూదనరావు, అన్నం శివకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొంటారని, ఈ సందర్భంగా 'నూతన సంవత్సరానికి స్వాగతం' అనే అంశంపై పెరసం ప్రధానకార్యదర్శి తోట సులోచన ఆధ్వర్యంలో కవిసమ్మేళనాన్ని నిర్వహిస్తారని తెలిపారు. సాహిత్యాభిమానులందరూ పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి
## ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్




విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆకాంక్షించారు. పాతపాటి సుబ్రహ్మణ్యం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇటీవల గూడూరు పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ ప్రొజెక్టర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ముందుగా సరస్వతి మాత విగ్రహానికి పూజలు నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్‌రావు, రాజ్యలక్ష్మి, కోడూరు మీరారెడ్డి, డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, సనత్ కుమార్‌రెడ్డి, ఎమ్.మురళీరెడ్డి, ఎస్.ఎల్.ఎన్.బాబు, పురుషోత్తం, ప్రసాద్ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి

గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్‌లో ఈ నెల 16న రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్మార్ట్‌మీటర్లు ఆపాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సి.పి.ఎం, సి.ఐ.టి.యు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచబోమని.. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఛార్జీలు పెంచేశారని, స్మార్ట్ మీటర్లు పెడితే పగల గొట్టమన్న కూటమినేతలే ఇప్పుడు వాటికి మద్దతు పలకడం విచారకరమన్నారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లు ఆపాలని, పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.




# రాజీయే రాజమార్గం

రాజీయే రాజమార్గమని, లోక్‌అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి పర్వీన్ సుల్తానా బేగం వెల్లడించారు. గూడూరు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ఇటీవల జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సుల్తానా బేగం మాట్లాడుతూ చిన్న చిన్న గొడవలతో కేసులు పెట్టుకుని సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరగడంవల్ల డబ్బు, సమయం వృధా అయిపోతుందని, న్యాయస్థానాల్లో కేసులు తగ్గించేందుకు విరివిగా లోక్‌అదాలత్‌లు జరుగుతున్నాయని తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల ఇరు వర్గాలవారు మనశ్శాంతిగా జీవించవచ్చని సూచించారు. సబ్‌జడ్జ్‌లు జయలక్ష్మి, లోకనాథం, లాయర్లు, పలు బ్యాంకుల అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ డిప్లొమో ఇంజనీర్ల సంఘ
# గౌరవ అధ్యక్షుడిగా రియాజ్

తిరుపతిలోని ఎస్సార్ కన్వెన్షన్ హాలులో ఇటీవల జరిగిన రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లొమో ఇంజనీర్ల సంఘ సర్వసభ్య సమావేశంలో సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా షేక్ రియాజ్ అహ్మద్‌ని తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అదేవిధంగా రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన కె.రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాకుళంకు చెందిన మహంతి, ట్రెజరర్‌గా విజయవాడకు చెందిన వెంకటరెడ్డిలను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం




నూతన కార్యవర్గానికి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మెన్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, శివారెడ్డి, జనరల్ సెక్రెటరీ పురుషోత్తమ నాయుడు, వెస్ట్ కృష్ణ ఎన్జీవో సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ పాల్గొన్నారు.

# పేదలకు పిఆర్ క్లబ్ దుప్పట్లు



గూడూరు పిఆర్ క్లబ్ పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, రాబోయే రోజుల్లో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని పిఆర్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్యే చేతులమీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ధనికులు సభ్యులుగా ఉన్న పిఆర్ క్లబ్ పేదప్రజల కోసం దుప్పట్లు అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్‌రావు, కోడూరు మీరారెడ్డి, తలమంచి సిద్ధారెడ్డి, మధు, మస్తాన్‌నాయుడు, వాయుగుండ్ల వెంకటసుబ్బయ్య, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

# మహాయజ్ఞం ఫలిస్తే మరో చరిత్రే!

(మొదటిపేజీ తరువాయి)

రాళ్లు.. రప్పలతో ఉన్న హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా తీర్చిదిద్దిన ఘనత ఆయనది. సైబరాబాద్ కమిషనరేట్‌కు ఊపిరిపోసిన నేర్పరి. ఇదే కోవలో ప్రస్తుతం నవ్యాంధ్ర అభివృద్ధికి స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ -2047ను రూపొందించారు. ఇందులో ప్రధానంగా 10 అంశాలకు ప్రాధాన్యమిచ్చారు. వాటి అంతర్గత సారాంశం మరో 23ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ కావడమే. ఇది ప్రస్తుతం అభివృద్ధి చెందిన అనేక యూరోపియన్ దేశాల ఆర్థిక వ్యవస్థలతో సమానం. ఇక పేదరికం లేని సమాజ నిర్మాణం తొలి అంశంగా పేర్కొన్నారు. రెండోది ఉద్యోగాల కల్పన. మూడోది నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నాలుగోది నీటి వనరుల పరిరక్షణ, ఐదోది రైతులు-అగ్రిటెక్, ఆరోది గ్లోబెల్ బెస్ట్ లాజిస్టిక్స్, ఏడోది విద్యుత్ ఇంధన రంగాల్లో నియంత్రణ, ఎనిమిదవది ప్రాడెక్ట్ పర్‌ఫెక్షన్, తొమ్మిదవది పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్, పదోది డీప్ టెక్ (విస్తృత స్థాయిలో టెక్నాలజీ వినియోగం).

## అమలు కోసం వినూత్న మార్గాలు..

విజన్ డాక్యుమెంట్‌లోని 10 సూత్రాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక మార్గాలను ఎంచుకుంటోంది. ఇందుకోసం వెల్తీ, హెల్తీ, హ్యాపీ అనే థీమ్‌ను ఎంచుకున్నారు. ఏపీ పేదరిక నిర్మూలన కోసం దశాబ్దాలుగా పాటిస్తున్న అంశాలను కాకుండా వినూత్నంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. ప్రజల్లో బాధ్యతాయుత ప్రవర్తనను పెంచి.. తద్వారా పబ్లిక్, పీపుల్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ అనే కొత్త అంశాన్ని ముందుకు తెచ్చారు. రాష్ట్రంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగు స్థాయిలోని 10 శాతాన్ని దత్తత తీసుకునే విధానాన్ని తీసుకురానున్నారు. అదే సమయంలో ప్రతి కుటుంబ స్థాయిని పూర్తిగా విశ్లేషించి తద్వారా వారి ఆదాయాన్ని పెంచనున్నారు. అలాగే అన్ని మౌలిక సదుపాయాలను సమగ్రంగా చేకూర్చనున్నారు. విద్య, వైద్యం ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇక ఉద్యోగాల కల్పన కోసం అన్ని స్థాయిల వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నారు, వారి స్కిల్స్‌ను పెంపొందించనున్నారు. తద్వారా రాష్ట్రంలో పెట్టుబడుల వెల్లువ ఉంటుందని భావిస్తున్నారు. మొత్తం 20లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా స్కిల్ అండ్ హ్యూమన్ సోర్సెస్ విభాగాన్ని ప్రవేశపెట్టనున్నారు. పారిశ్రామికవేత్తలకు భారీస్థాయిలో ప్రోత్సాహకాలను ప్రకటించాలని నిర్ణయించారు. ఇక పురాతన నాగరికతలు ప్రారంభమైన కాలం నుంచి నీరు ప్రధానం. అందుకే అన్ని రంగాలకు పూర్తిస్థాయిలో నీరు అందుబాటులో ఉంచి ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచనున్నారు. ఇందుకోసం రాష్ట్రంలో నదుల అనుసంధానంపై చంద్రబాబు దృష్టి సారించనున్నారు. ఇదే సమయంలో వ్యవసాయంతో సాంకేతికతను పెంచి విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, వేస్టేజ్ నియంత్రణే ధ్యేయంగా ముందుకు సాగనున్నారు. ఇందుకోసం(ఏఐ) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్‌లను వినియోగించుకోనున్నారు. అలాగే రోడ్డు, రైలు మార్గాల అభివృద్ధితో రాష్ట్రంలో తక్కువ సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించేలా కనెక్టవిటీపై దృష్టి సారించనున్నారు. రవాణా వ్యయాన్ని తగ్గించనున్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించనున్నారు. ఇదే సమయంలో తయారీ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించి ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని భావిస్తున్నారు. చివరగా స్వచ్ఛాంధ్రకు ప్రాధాన్యత ఇచ్చి గ్రామ స్థాయి నుంచి నగరాల వరకు క్లీన్ ఏపీ నినాదాన్ని వినిపించనున్నారు.

## సవాళ్లు.. కోకోల్లలు..

అనేక రకాలైన వైవిధ్యతలకు, వైరుధ్యాలకు నిలయమైన ఆంధ్రప్రదేశ్‌లో అనుకున్నవి అనుకున్నట్లు అమలు చేయడం కత్తిమీద సామే. నిజం చెప్పాలంటే గత ఐదేళ్లలో అతి సంక్షేమంతో రాష్ట్ర అభివృద్ధి అటకెక్కింది. ముఖ్యంగా పారిశ్రామికరంగం పడకేసింది. ఇలాంటి సమయంలో అత్యంత సుధీర్ఘలక్ష్యంతో ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్‌ను ప్రారంభించడం సవాలుతో కూడుకున్న అంశమే. ఇప్పటికే పోలవరం, అమరావతి అనే రెండు మహా సంకల్పాలను భుజాల పైకెత్తుకున్న కూటమి ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్ -2047తో మరో బృహత్తర లక్ష్యాన్ని తలకెత్తుకుంది.

నిజానికి బియ్యం ఎసట్లో పోయగానే కడుపు నిండిపోదు అన్నది ఎంత నిజమో.. లక్ష్యం నిర్దేశించుకున్నంత మాత్రన ఫలితం సాధించేశాం అనుకోవడం కూడా అంతే మూర్ఖత్వం. పొయ్యి వెలిగించి ఎసట్లో బియ్యాన్ని మరిగించి, గంజి వార్చి, వడ్డించి.. భోజనం చేసి వాటిని సమర్థంగా జీర్ణించుకున్నప్పుడే కొత్త శక్తిగా మారుతుంది. అలాగే అభివృద్ధికి అంచనాలు, నమూనాలు మాత్రమే పరమావధి అయితే ప్రయోజనం శూన్యమే. ప్రాంతాల ప్రత్యేక అవసరాలు, రాష్ట్రంలో ఉన్న వనరులు, యువశక్తి ప్రతిభాపాటవాలను గుర్తించి ఆ దిశగా ఆశయాలను అమలుచేసి, సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగితేనే అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలతో పాటు అందరికీ అందుతాయి. రాష్ట్రంలో సమతౌల్య అభివృద్ధి సాధ్యమవుతుంది.



## చినబాబు అభివృద్ధే.. రాష్ట్రాభివృద్ధి అనుకుంటే..!

ఆరు నూరైనా.. ఎవరు ఎన్నన్నా.. కుమారుడు లోకేష్ భవిష్యత్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. చినబాబును ఎలాగైనా పెదబాబు చేయాలన్నదే ఆయన ఏకైక టార్గెట్ అంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే 75వ పడిలో ఉన్న చంద్రబాబు రాజకీయ జీవితం క్రమంగా చరమాంకానికి వచ్చినట్లే. ఈ దఫా పాలన ముగిసేలోపు ఆయన 80ల్లోకి వచ్చేస్తారు. ఆ సమయంలో మానసికంగా ఎంత ధృఢంగా ఉన్నా శారీరకంగా మాత్రం కొంత చురుకుదనం లోపించే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో తెలుగుదేశం పార్టీతో పాటు కూటమి ప్రభుత్వంలోనూ లోకేష్‌ను ఫోకస్ చేసే విషయంలో ఆయన ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకుంటారనడంలో మరో మాటకు తావులేదు. అయితే, గత 2014-19 పాలనలో లోకేష్‌ను ఎమ్మెల్సీగా తీసుకురావడం, అప్పటికప్పుడు మంత్రిని చేయడంతో రాజకీయంగా ఆయన పలు విమర్శలను మూటగట్టుకున్నారు. దాని పర్యవసానం 2019 ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలో ఈసారి ఆయన విజన్ డాక్యుమెంట్-2047ను అమలు చేసే క్రమంలో చినబాబు పాత్రను ఎలా ముందుకు తీసుకెళ్తారు. విమర్శలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. గతంలో పోల్చితే మాట.. తీరు మార్చుకుని ముందుకు సాగుతున్న లోకేష్ కూడా ఈ విషయంలో కొంత జాగ్రత్తపడతారన్నది విశ్లేషకుల భావన. అయితే అతి ఫోకస్ ఎదైనా ప్రమాదకరమేనన్నది అందరూ ఒప్పుకునే నిజం. బలవంతంగా రుద్దితే తాత్కాలిక ప్రయోజనం తప్పు.. శాశ్వత ప్రయోజనం ఉండదన్నది గుర్తెరగాల్సిందే.

## హైదరాబాద్ తరహాలో అమరావతి

రాజకీయాల్లో 50 ఏళ్లంటే పాతికేళ్లతో సమానం అంటారు పెద్దలు. 1999లో రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు విజన్2020 పేరుతో హైదరాబాద్ రూపురేఖలు మార్చేందుకు తీవ్రంగానే ప్రయత్నించారు. అయితే ఐదేళ్ళ పాలన అనంతరం ఆయన అధికారం కోల్పోవడంతో 2004లో సీఎం అయిన వైఎస్సార్, తర్వాత వచ్చిన రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి కూడా హైదరాబాద్ అభివృద్ధికి తమవంతు సహకారం అందించారు. ముఖ్యంగా వైఎస్ హయాంలో అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్‌రోడ్డు హైదరాబాద్ అభివృద్ధికి ఊతమిచ్చాయి. ఈ క్రమంలోనే మినీ ఇండియా అనే స్థాయిలో అన్ని భాషల ప్రజలు హైదరాబాద్‌లో సెటిలయ్యారు. ఈ దశలో నగరం అంతకంతకూ విస్తరించి కాస్మోపాలిటిన్ సిటీగా అవతరించింది. దీంతో హైదరాబాద్‌కు తొలుత జవసత్వాలు నింపి.. ఐటీకి పునాదులు వేసిన నాయకుడిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయారు. కానీ, ఇప్పుడిప్పుడే పురుడుపోసుకుంటున్న అమరావతి అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ 2047 పేరుతో 23 సంవత్సరాల లక్ష్యాన్ని చంద్రబాబు నిర్దేశించుకున్నారు. ఇదే సమయంలో తర్వాత ఏర్పడబోయే ప్రభుత్వాలకు కూడా ఆయన దిశానిర్దేశం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ప్రస్తుతం చంద్రబాబు వయస్సు 75 ఏళ్లు. ఈ క్రమంలో వందేళ్ల స్వాతంత్ర్య సంబరాలను జరుపుకునే సమయానికి ఆంధ్రప్రదేశ్ ప్రగతి ఈ స్థాయిలో ఉండాలంటూ ఆయన తన కలలకు విజన్ డాక్యుమెంట్ -2047తో జీవం పోయనున్నారు. ఈనేపథ్యంలో ఆయన లక్ష్యాలు వాస్తవికతకు ఏమేరకు దగ్గరగా ఉంటాయి.. అవి అమలులో ఏ మేరకు విజయవంతమవుతాయో మిలియన్ డాలర్ల ప్రశ్నే. ఏదేమైనా మరగుజ్జు మహాసముద్రాన్ని ఈదినంత కష్టమైన లక్ష్యాన్ని భుజాలకెత్తుకున్న చంద్రబాబు.. సాలీడు తన గూడును నిర్మించుకున్నంత నేర్పరితనంతో ఆంధ్రరాష్ట్రం అభివృద్ధికి రోడ్డు మ్యాప్‌ను విజన్ డాక్యుమెంట్ 2047ను రూపొందించారు. ఇది అన్ని అడ్డంకులు దాటుకుని క్షేత్రస్థాయిలో విజయవంతమైతే చంద్రబాబు అనుకుంటున్న స్వర్ణాంధ్ర కలకు నిజమైన బీజం పడినట్టే..! మరో చరిత్రకు మార్గం సుగుమమైనట్లే.!

# శిథిలమైపోయిన..'శిల్పారామం'

- సగంలోనే పనులకి ఎగనామం
- మంత్రులు, నాయకులు, అధికారులు చొరవచూపాలి



ఇదో అందమైన క(ళ)ల

'శిల్పారామం'.. ఈ పేరు వినగానే అపురూపమైన హస్తకళలకు నెలవైన సాంస్కృతిక ప్రాంగణాలు మనకి స్ఫురిస్తాయి. అనేకమంది చేతి వృత్తుల కళాకారులకి ఈ శిల్పారామాలు జీవనాధారంగా కూడా అవతరించాయి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలని ప్రతిబింబించే హస్తకళారామాలే ఈ శిల్పారామాలు. ఇలాంటి శిల్పారామాలు ప్రస్తుతం హైదరాబాదు, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, పులివెందల, అనంతపురం, పుట్టపర్తి, కడప తదితర ప్రాంతాలలో ప్రారంభించబడి, ఆయా ప్రాంతాల ప్రజలకి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. విశేష ప్రజాదరణ కూడా పొందుతున్నాయి.

కానీ, నెల్లూరీయులకి మాత్రం ఇదో తీరని కలగానే మిగిలిపోయింది. ఆర్భాటంగా మొదలైన నిర్మాణం సగంలోనే ఆగిపోయింది. ఆరంభశూరత్వానికి సాక్షీభూతంగా నిలిచిపోయింది. నెల్లూరునగర శివార్లలో అరాకొర నేలకొరిగిన కట్టడాలతో శిధిలావస్థకి చేరి.. కొనవూపిరితో ఉన్న కట్టడం దీనంగా దర్శనమిస్తుంది.

## సంస్కృతీ సంప్రదాయాల నిలయాలు శిల్పారామాలు

సంప్రదాయ చేనేత కార్మికుల పరిరక్షణ లక్ష్యంగా, హస్తకళల ప్రోత్సాహమే ధ్యేయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సేవాలయాలే శిల్పారామాలు. కనుమరుగైపోతున్న అనేక సంప్రదాయ, సాంస్కృతిక వారసత్వాలను కొనసాగించే ప్రయత్నంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1992లో వీటిని సమాజానికి పరిచయం చేసింది. అప్పటి ప్రభుత్వం భారతీయ ఆచారాల్ని, హస్తకళలని ప్రోత్సహిస్తూ వాటికి సంరక్షణ కల్పించడం కోసం కళాత్మకమైన వేదికలను ముందుగా ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాదులో నిర్మించింది. ఆ తరువాత దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే విధంగా తెలుగు రాష్ట్రాలలో మరికొన్ని జిల్లా కేంద్రాలలో సైతం వాటిని ఏర్పాటు చేశారు. శిల్పారామాలు ఉన్న ప్రదేశాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో వాటికి మంచి అదరణ లభించింది. ఆయా ప్రాంతాలకు సంబంధించిన చేనేత, హస్తకళా రంగాలవారికి ఈ శిల్పారామాలు ఆదాయ వనరులుగా మారాయి. గ్రామీణ వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లుగా సృష్టించి తెలుగుదనం ఉట్టిపడేలా వాటిని నిర్మించారు.

## ఆరంభశూరత్వంగా నెల్లూరు శిల్పారామం

నెల్లూరు నగరానికి సమీపంలో ఉన్న బుజబుజ నెల్లూరు వద్ద శిల్పారామాన్ని ఏర్పాటు చేయడానికి ఆనాటి మంత్రి రామనారాయణరెడ్డి చొరవతో ఆడంబరంగా 2008లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ శిల్పారామంలో హస్తకళల ప్రదర్శనతో పాటు యువతను ఆకర్షించేవిధంగా వాటర్‌స్పోర్ట్స్, బోటింగ్, ఫుడ్‌కోర్టులు, ఫంక్షన్‌హాల్ వంటివి కూడా నిర్మించాలని ప్రణాళికని సిద్ధం చేసుకున్నారు. ఇప్పుడు ఆ పనులు సగంలోనే ఆగిపోయాయి. శిల్పారామం నిర్మాణం చేపట్టిన ప్రాంతం ప్రభుత్వ రికార్డుల ప్రకారం చెరువు అని, అక్కడ నిర్మాణాలు చట్ట విరుద్ధమని కొంతమంది కోర్టులని ఆశ్రయించినట్లు అధికారులు చెప్తున్నారు. ఆ తరువాత రాష్ట్రం విడిపోవడంతో ఈ శిల్పారామం గురించి పట్టించుకునే నాధులే లేరు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన ప్రత్యామ్నాయ భూమిని కేటాయిస్తే, నెల్లూరువాసుల శిల్పారామం కల వాస్తవ రూపం దాల్చే అవకాశంఉంది. అయితే, మన నెల్లూరు నాయకులెవరూ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడంలేదు.

## ఆహ్లాదం... ఆనందం

దాదాపు పదిలక్షల జనాభా ఉన్న నెల్లూరు నగరంలో ఆదివారం వస్తే కుటుంబ సమేతంగా ఆహ్లాదంగా గడపడానికి ఆదిత్య నగర్‌లో వున్న చిన్నపిల్లల పార్కు, ఎం.జి మాల్, లేదంటే సినిమాహాళ్లు తప్ప మరో ప్రత్యామ్నాయమే లేదు. నగరానికి దూరంగా అటు మైపాడు లేదా కొత్తకోడూరు బీచ్‌లకి కూడా జనం క్యూ కడుతుంటారు. ఇలాంటి తరుణంలో శిల్పారామం వంటి సకల సౌకర్యాల సముదాయాలు నెల్లూరీయులకి చాలా అవసరం. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నాయకులు నెల్లూరు శిల్పారామంపై దృష్టి పెట్టాల్సిన అవసరం చాలా వుంది. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మునిసిపల్ శాఖామాత్యులు పొంగూరు నారాయణలు శిల్పారామం ఏర్పాటుకి ప్రయత్నాలు ప్రారంభిస్తే ప్రజలు హర్షిస్తారు. ఆహ్లాదంతో పాటు ఆనందం ఇచ్చే శిల్పారామం వంటి నిర్మాణాలు ప్రస్తుత ఆధునిక సమాజానికి చాలా అవసరం. క్షణం తీరిక లేకుండా వారమంతా శ్రమించే వారి మనసుకి ఉల్లాసాన్ని, శరీరానికి ఉత్సాహాన్ని ఇచ్చి వారిని మానసిక, శారీరక ఆరోగ్యవంతులుగా జీవింపచేయడానికి శిల్పారామం వంటివి దోహదం చేస్తాయి. మంత్రులు, పార్లమెంటు సభ్యులు, స్థానిక శాసనసభ్యులు, నుడా ఛైర్మెన్ వంటివాళ్ళు నెల్లూరు శిల్పారామానికి మోక్షం ప్రసాదిస్తారని ఆశిద్దాం!

# ఫలించిన.. కాకర్ల వ్యూహం!

## ఉదయగిరిలో...
## 150 సాగునీటి సంఘాలు ఏకగ్రీవం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ వ్యూహం ఫలించింది. తొలి అడుగులోనే ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగరవేసి రికార్డు సృష్టించిన ఎమ్మెల్యే కాకర్ల, రెండవ అడుగులో కూడా అదే జోరు కొనసాగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో గత మూడు రోజులుగా సంప్రదింపులు జరుపుతూ, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నియోజకవర్గంలోని సుమారు 150 సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీసీ మెంబర్ల స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల్లో అద్భుత విజయం సాధించడం పట్ల ఇటు అధికారులు, అటు నాయకులు ఎమ్మెల్యే కాకర్లకు అభినందనలు తెలియజేస్తున్నారు. దీంతో దాదాపు వెయ్యి మందికిపైగా ఉమ్మడి ప్రభుత్వంలో నాయకులు, కార్యకర్తలు సాగునీటి సంఘాల పదవులలో కొలువు దీరనున్నారు. కొత్తగా ఎన్నికైన వారు తమపై నమ్మకంతో ఆ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం



ఇంధన వృధాను అరికట్టి, ఇందన పొదుపు కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణధికారి శ్రీనివాసరావు చెప్పారు. జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు సెట్నెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక ఆదిత్య కళాశాలలో వ్యాసరచన పోటీ నిర్వహించి, పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో వై.సురేఖ (ప్రథమ), పి.మమత (ద్వితీయ), కె.జ్యోత్స్న (తృతీయ)లు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, 'ఇంధనం పొదుపు చేస్తే-ఇంధనాన్ని ఉత్పత్తి చేసినట్లే' అనే అంశాన్ని నినాదంగా పెట్టుకొని విద్యుత్తు, పెట్రోలు, బొగ్గు మొదలైన వాటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, విశ్రాంత డెప్యూటీ లేబర్ కమిషనర్ రాచపాలెం రఘు, ఎస్.వి.రమేష్‌బాబు, కె.కృష్ణారెడ్డి, డాక్టర్ చీదరాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ అప్‌డేట్ గడువును పొడిగించారు

ఆధార్ కార్డులను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు డిసెంబరు 14వ తేదీ గడువు ముగిసిన నేపథ్యంలో, తాజాగా ఆ గడువు తేదీని జూన్ 14వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఉడాయ్ పేర్కొంది. 'మై ఆధార్ వెబ్‌సైట్' ద్వారా ప్రజలు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చని సూచించింది. జూన్ 14 తర్వాత ఆధార్ అప్‌డేట్ చేయాలంటే నిర్ధిష్ట రుసుమును చెల్లించాల్సి ఉంటుందని ఈనెల 14న ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

# వైభవంగా శ్రీ దత్త జయంతి



శ్రీ దత్తాత్రేయ స్వామి వారి జయంతి సందర్భంగా ఈనెల 14న వెంకటాచలం మండలం గొలగమూడిలోని గురు ధ్యాన నిలయంలో శ్రీ దత్తాత్రేయస్వామివారికి, శ్రీ సాయినాథునికి, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారికి విశేష పూజలు, సేవలు జరిగాయి. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ గావించారు.

# మమ్మల్ని ఆదుకోండి

**• టిడ్కో చైర్మెన్ వద్ద హెల్త్ అసిస్టెంట్ల గోడు**



వైద్యారోగ్య శాఖలో ఏళ్ళతరబడిగా విధులు నిర్వహిస్తున్న తమను ఇటీవల ఉద్యోగాల నుంచి తొలగించారని, తమ సమస్యలను సానుభూతితో పరిశీలించి తమకు, తమ కుటుంబాలకు న్యాయం చేయాలంటూ పలువురు హెల్త్ అసిస్టెంట్లు ఏపీ టిడ్కో చైర్మెన్ వేములపాటి అజయ్‌కి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల నెల్లూరులోని జనసేన కార్యాలయంలో వారు ఆయన్ను కలసి తమ బాధలు చెప్పుకున్నారు. 2002లో వైద్యారోగ్యశాఖ నిర్వహించిన డీఎస్సీ ద్వారా తామంతా ఉద్యోగాల్లో చేరామని, ఇప్పుడు తమను తొలగించడంతో తమ జీవన పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వారు తమ గోడు చెప్పుకున్నారు. ఆ సమస్యలను డెప్యూటి ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్ళి తగు పరిష్కారానికి కృషిచేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

# ప్రతిభ చూపిన.. ఎన్‌బికెఆర్ విద్యార్థి కీర్తన్‌పాల్



కోట మండలం ఎన్‌బికెఆర్ కళాశాలలో బీటెక్, ఇసిఇ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్న ఇండ్లూరి అభిషయ్ కీర్తన్‌పాల్ అనే విద్యార్థి (ఎన్‌సిసి నావల్ వింగ్) ఈనెల 14 నుండి జనవరి 4వ తేదీ వరకు జరిగే ఓవర్ సీస్ డెప్లాయిమెంట్ క్యాంప్‌కు ఎన్నిక కావడం పట్ల కళాశాల వారు హర్షం వ్యక్తం చేస్తూ, ఆ విద్యార్థి ప్రతిభను మెచ్చుకున్నారు. ఈనెల 14వ తేదీన చెన్నై షిప్ యార్డ్ నుండి సముద్ర మార్గాన షిప్‌లో అభిషయ్ బయలుదేరాడని, అక్కడ నుంచి శ్రీలంక, మాల్దీవ్ దేశాలకు వెళ్ళి, అక్కడ మన దేశ సంస్కృతి, సంప్రదాయలను, ఆచార, వ్యవహారాలను వారికి తెలియజేస్తాడని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ఆ దేశాల్లోని వారి పద్ధతులను, జీవన శైలిని తెలుసుకొని ఆ అనుభవాలను మన కళాశాల, యూనిట్, గ్రూప్ కాడెట్స్‌తో పంచుకుంటాడని వివరించారు. అందుకు దేశవ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు ఎన్నికైతే, అందులో తమ కళాశాల నుండి అభిషయ్ కీర్తన్‌పాల్ ఉండడం సంతోషకరమని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ నావల్ యూనిట్ అధికారి డా.మల్లికార్జునరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాథరెడ్డి తదితరులు అభిషయ్‌ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి.. ఆ విద్యార్థిని ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు కూడా ఇలాంటి ఉత్తమ శిక్షణా శిబిరాలకు ఎంపిక కావాలని, ఎన్‌సిసిలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.

# అమరజీవికి ఎన్జీఓ నేతల నివాళి



ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుంటూ నెల్లూరులో ఈనెల డిసెంబరు 15న ఎన్జీఓల అసోసియేషన్ నేతలు ఆ మహనీయునికి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం.. డిసెంబర్ 15ను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్జీఓ అసోసియేషన్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు తదితరులు పాల్గొని ఆ త్యాగధనుని సేవలను కొనియాడారు. ఎన్జీఓల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం ఆంజనేయవర్మ, జిల్లా కోశాధికారి విఎంవి ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంచలయ్య, ఉపాధ్యక్షులు కిరణ్, సతీష్‌బాబు నెల్లూరు నగర కార్యదర్శి మార్కండేయులు, నగర కోశాధికారి సురేష్, మురళి పాల్గొన్నారు.

# అధికారపార్టీదే హవా!

**• 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఏకగ్రీవం**

జిల్లాలో ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ ఆధిపత్యం సాధించింది. ఈనెల 17న జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు కూడా ప్రశాంతంగానే జరిగాయి. పెన్నార్‌డెల్టా, సోమశిల ప్రాజెక్టులకు సంబంధించిన 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అధికార పార్టీ అభ్యర్థులే ఏకగ్రీవంగా నిలిచారు. వైకాపా ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో తెదెపాదే పైచేయి అయింది.

# టూకీగా...



## మనుబోలులో వెంకయ్యస్వామికి అభిషేక సేవలు

మనుబోలు సమీపంలోని చెర్లోపల్లి రైల్వేగేట్ వద్దనున్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి దేవస్థానంలో ఇటీవల విశేషపూజలు జరిగాయి. ఉభయదాతలు యనమల అంకయ్య-పద్మమ్మల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాలతో వైభవంగా అభిషేక సేవలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## చెర్లోయడవల్లిలో ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో ఇటీవల డాక్టర్ ప్రమీల పర్యవేక్షణలో, మాజీసర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, షుగర్-బీపీ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ఆలంబన ఫౌండేషన్ ఇండియా వారు 138 మందికి 3 నెలలకు సరిపడా మందులను ఉచితంగా ఇచ్చారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## దండిగుంటలో చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠ

విడవలూరు మండలం దండిగుంట దళితవాడలో ఇటీవల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో గ్రామస్తులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి కుంభాభిషేక మహోత్సవం నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

## కోవూరులో దొంగల హల్‌చల్

ఇళ్ళ తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడే దొంగలు ఇటీవల కోవూరులో నివాసం ఉంటున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటికి తాళాలు వేసి వుండడం చూసి, తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.60 వేలతో పాటు, వెండివస్తువులు దోచుకుపోయారు. కోవూరు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విడవలూరులో స్థానికులకు వైద్యపరీక్షలు

మండల కేంద్రమైన విడవలూరులోని రామాలయం వీధిలో ప్రభుత్వ వైద్యాధికారి కె.హరికృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 17న వైద్యశిబిరం ఏర్పాటుచేసి స్థానికులకు వైద్యపరీక్షలు చేశారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కలిగించారు.

## బుచ్చిలో హోటళ్ల యజమానులకు అవగాహన

బుచ్చి నగర పంచాయతీ కార్యాలయంలో ఈనెల 17న హోటళ్ళ యజమానులకు ఆహర భద్రత అధికారిణి డాక్టర్ నీరజ ఆధ్వర్యంలో అవగాహన కలిగించారు. ఆహారపదార్థాల్లో హానికరమైన రంగులను వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## కురిచెర్లపాడు వరి రైతులకు సూచనలు

వెంకటాచలం మండలంలోని కురిచెర్లపాడు, పాలిచెర్లపాడు గ్రామాల్లోఈనెల 17న వ్యవసాయ శాఖ అధికారులు 'పొలం పిలుస్తోంది'కార్యక్రమం నిర్వహించి రైతులకు తగు సూచనలిచ్చారు. ఆధునిక వ్యవసాయంలో సాగుపద్ధతుల గురించి వారికి వివరించారు. వ్యవసాయ అధికారి హరికరుణాకర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారిణి ప్రేమలత, జాహ్నవి పాల్గొన్నారు.

## వేదగిరిలో ధనుర్మాస పూజలు

నెల్లూరు రూర్ మండలం నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 17న స్వామివారికి విశేషంగా ధనుర్మాస పూజలు నిర్వహించారు. ప్రాత:కాల దీపారాధన చేసి, తిరుప్పావైని పారాయణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

## కౌరుగుంటలో రెవిన్యూ సదస్సు

దగదర్తి మండలం, కౌరుగుంటలో ఈనెల 17న తహశీల్దార్ పి.కృష్ణ ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల వద్ద నుంచి అర్జీలు స్వీకరించి, త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని రైతులకు చెప్పారు.

# శ్రీవారి శీఘ్రదర్శనం టికెట్లు మాకూ ఇవ్వండి

## మంత్రి ఆనంను కోరిన తమిళనాడు టూరిజం మంత్రి



తమిళనాడు టూరిజం కార్పొరేషన్‌కు ఎప్పటిలాగే తిరుమల తిరుపతి దేవస్థానంలో శీఘ్ర దర్శనం టిక్కెట్లను కేటాయించాలని ఆ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రాజేంద్రన్ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆయన మంత్రి ఆనంకు లేఖను అందజేశారు. మంగళవారం ఉదయం ఆయన చెన్నైనుంచి నెల్లూరులోని మంత్రి ఆనం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. తొలుత ఆయన్ను జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి ఫరూక్, మంత్రులు ఆనం, నారాయణలు స్వాగతించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా రాజేంద్రన్ మాట్లాడుతూ 1974వ సంవత్సరం నుంచి తమిళనాడు టూరిజం డెవలప్‌మెంటు కార్పొరేషన్‌కు టీటీడీ దర్శన టిక్కెట్లను కేటాయిస్తుందని, దీంతో తమిళనాడులోని భక్తులు చాలామంది ఆ అవకాశాన్ని వినియోగించుకుంటూ శ్రీవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. అయితే ఇటీవల అన్ని టూరిజం కార్పొరేషన్లకు శీఘ్రదర్శన టికెట్ల కోటాను టీటీడీ బోర్డు రద్దు చేసిందని, దీనిని వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆనంకు విజ్ఞప్తి చేశారు.

# వేడుకగా..'క్రిస్మస్' క్యారల్స్



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని, ముందస్తుగా ఈనెల 16వ తేదీ రాత్రి నెల్లూరు ఏబీఎం కాంపౌండ్ వద్ద క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించుకున్నారు. 'సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్' ఛైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి నగరంలో ర్యాలీ నిర్వహించారు. బిషప్ ఎం.డి ప్రకాశం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డౌనీహాలు చర్చి పాస్టర్ రెవరెండ్ కె.శ్యాంసన్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్ తదితరులు కొవ్వొత్తులు వెలిగించి బెలూన్లు ఎగురవేశారు. గాయనీ గాయకులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ గీతాలను ఆలపించారు. ప్రముఖులు ఊరందూరు సురేంద్రబాబు, బర్నబాస్, కన్వీనర్లు రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ జానీజో, క్వైర్ డైరెక్టర్లు శ్యాంసన్, మౌంట్‌బాటన్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆధార్ కోసం

# ప్రత్యేక శిబిరాలు

రాష్ట్రంలో ఆధార్ నమోదు లేని ఆరేళ్ల లోపు చిన్నపిల్లల కోసం మరో రెండు వారాలపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను కొనసాగించేలా సచివాలయాల సంచాలకులు ఎం.శివ ప్రసాద్ ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రంలో ఆరేళ్ల లోపు వయసున్న చిన్నారులు 11.65లక్షల మంది వరకు ఉన్నారు. అయితే నవంబరు 1 నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో 64,441 మంది చిన్నారుల ఆధార్ మాత్రమే నమోదైంది. ఇంకా దాదాపు 11 లక్షల మంది చిన్నారుల వివరాలు నమోదు కాలేదని సమాచారం. దీంతో, ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు, 26 నుంచి 28వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాల్లో ఆధార్ నమోదుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీంతోపాటు బయోమెట్రిక్ నవీకరణకు కూడా అవకాశం కల్పించింది. ఇకనైనా, తల్లితండ్రులు ఆధార్ నమోదు కాని చిన్నారుల కోసం ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.

## మరో రెండు రోజులు..

# జోరు వానలే!

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కోస్తా తీరం వైపు దూసుకు వస్తుండడంతో, ఈనెల 21వ తేదీ వరకు జోరు వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్తోంది. ఇప్పటికే నెల్లూరుజిల్లాలో గత మూడు నాలుగు రోజులుగా ముసురు వాతావరణంతో పాటు పొగమంచు ప్రభావం ఎక్కువగానే ఉంది. జిల్లా వ్యాప్తంగా చెదురుమదురుగా వానలు కురుస్తున్నాయి కూడా. తాజాగా ఈ అల్పపీడనం వాయువ్య దిశగా పయనిస్తూ తమిళనాడు చేరువలోకి రావడంతో, ఉత్తర కోస్తాలో అనేక ప్రాంతాల్లో, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురవవచ్చని భావిస్తున్నారు. ప్రత్యేకించి నెల్లూరు-తిరుపతి జిల్లాల్లో ఈనెల 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటున్నారు.

# నాన్నా!.. ప్రజల కష్టాలు తీర్చండి

## తండ్రికి అర్జీ ఇచ్చిన తనయుడు



ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ తండ్రి కాకర్ల సురేష్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు కృషి చేయాలంటూ ఆయన తనయుడు కాకర్ల సంహిత్ విన్నవించడం స్థానికులను ఆకట్టుకుంది. వివరాలిలా ఉన్నాయి. అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న సంహిత్, ఇటీవల వింజమూరుకు వచ్చాడు. ఎన్నికలప్పుడు తండ్రి చేసిన వాగ్దానాలను వివరిస్తూ, సామాన్య కార్యకర్త వలే ఆ సమస్యలను తీర్చాలంటూ అర్జీ రూపంలో రాసుకుని తీసుకువెళ్లి పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉన్న తండ్రికి ఇచ్చాడు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరాడు. తండ్రి కూడా అందుకు స్పందించి తప్పకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పాడు. ప్రజల సమస్యలు తీర్చమంటూ తండ్రికి తనయుడే అర్జీ ఇవ్వడాన్ని ఈ సందర్భంగా స్థానికులు కొనియాడారు.

# నేత్రపర్వంగా.. శ్రీసిటీ 'శ్రీవాణి' వేడుకలు




శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక 'శ్రీవాణి' ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 19న గురువారం నాడు శ్రీసిటీలో నేత్రపర్వంగా జరిగాయి. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'సినీ విజ్ఞాన విశారద' అవార్డు గ్రహీత, ఎస్వీ రామారావు పాల్గొని, శ్రీసిటీ శ్రీవాణి ఆధ్యాత్మిక సేవలను మెచ్చుకున్నారు. 'సినీ సాహిత్యంలో పౌరాణిక ప్రభావం' అనే అంశంపై ఆయన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, 'శ్రీవాణి' ద్వారా ఏడాదిగా తాము నిర్వహిస్తున్న వివిధ భక్తిమయ, సంగీత, సాహిత్య ప్రదర్శనలను వివరించారు. అనంతరం, ఎస్వీ రామారావును ఘనంగా సత్కరించారు. మాజీ శ్వేతా డైరెక్టర్..ప్రముఖ సాహితీవేత్త భూమన్, మాజీ వైస్‌ఛాన్స్‌లర్ కుసుమకుమారి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. శ్రీసిటీ పిఆర్వో పల్లేటి బాలాజీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# డీకేడబ్ల్యు కళాశాలలో.. 23న జాబ్‌మేళా

రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్టలోని డీకేడబ్ల్యు కళాశాలలో ఈనెల 23న జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ గిరి ఒక ప్రకటనలో కోరారు.

# వాహనాల తయారీలో దూసుకుపోతున్న.. 'శ్రీసిటీ-ఇసుజు'

## ○ లక్షకు చేరిన 'మేడ్ ఇన్ ఇండియా' వాహనాలు




శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమ (ఐఎంఐ) 'మేడ్ ఇన్ ఇండియా' వాహనాల ఉత్పత్తిలో మరో ముఖ్యమైన మైలురాయిని అధిగమించింది. తాము ఉత్పత్తి చేసిన వాహనాల సంఖ్య లక్షకు చేరడంతో పరిశ్రమ వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 18న తమ ప్లాంట్‌లో తయారైన లక్షవ వాహనాన్ని విడుదల చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ పాల్గొని శ్రీసిటీ ప్రగతిని మెచ్చుకున్నారు. ఇసుజు మోటార్స్ ఇండియా టీమ్‌ను అభినందించారు. స్థానిక ప్రతిభను ప్రోత్సహిస్తున్న ఇసుజు యాజమాన్యాన్ని, వెనుకబడిన ప్రాంతంలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేసి భారీ ఉపాధి అవకాశాలను, మహిళా సాధికారతను ప్రోత్సహిస్తున్న శ్రీసిటీ ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సారథ్యాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆ కంపెనీ ఐఎంఐ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ మాట్లాడుతూ, ఈ ఘనత తమ సంస్థ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అందుకు ఎంతో సహకరించారంటూ కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, టీహెచ్‌కె డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ మరియు శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ గ్రూప్ ఎస్‌జేజీ ఛైర్మన్ సాడో తదితరులు పాల్గొన్నారు. ఇసుజు ఇంజినీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా ఛైర్మన్ సకామోటో, ఇసుజు మోటార్స్ ప్రెసిడెంట్, సీఓఓ షిన్‌సుకే మినామి, మిత్సుబిషి కార్పొరేషన్ మొబిలిటీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మరియు గ్రూప్ సీఈఓ షిగేరు వాకబయాషి వర్చువల్‌గా పాల్గొని ప్రసంగిస్తూ, ఇసుజు టీమ్‌ని అభినందించారు.

## శ్రీసిటీకి ఇది గర్వకారణం

**- ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి**

శ్రీసిటీ-ఇసుజు భాగస్వామ్యానికి, మరియు ప్రపంచ స్థాయి పారిశ్రామిక హబ్‌గా శ్రీసిటీ పాత్రకు ఈ అభివృద్ధి గర్వకారణమని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న మొదటి ఆటోమొబైల్ తయారీదారు 'ఇసుజు' అని ఆయన అంటూ, ఆ కంపెనీ విజయం శ్రీసిటీలోని పెట్టుబడులు, పర్యావరణ వ్యవస్థకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. భారత్ నుండి తేలికపాటి వాణిజ్య వాహనాలను ఎగుమతి చేసే అతిపెద్ద సంస్థగా ఇసుజు మోటార్స్ నిలిచిందని ఆయన అభినందించారు. కాగా, ఈ కంపెనీలో ఉన్న 1600మంది ఉద్యోగులలో 22 శాతం మహిళలు కావడం విశేషం. భారత వాణిజ్య వాహన పరిశ్రమలో ఇది అత్యధికంగా భావిస్తున్నారు. 50వేల యూనిట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో శ్రీసిటీ ప్లాంట్ ఇసుజు కార్యకలాపాలకు కీలకమైన కేంద్రంగా ఉండడం మరో ప్రత్యేకత. దాని ఉత్పత్తి శ్రేణిలో ఎస్-క్యాబ్ మోడల్ భారతదేశంలోని వాణిజ్యవిభాగంలో అత్యధికంగా అమ్ముడవుతున్న వాహనంగా నిలిచింది కూడా. ఇసుజు మొత్తం అమ్మకాలలో దేశీయ అమ్మకాలు 10-12శాతం వాటాతో ప్రాధాన్యత కలిగివుండడం ఆ కంపెనీ ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com